J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 19 14.10.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## విద్వేషాల దిశగా వికేంద్రీకరణ

# రాజకీయాల పడగలో రాష్ట్రం



### ప్రాంతీయ వాదంతో ముదురుతున్న వివాదం



### రాయలసీమ నుండి గళం విప్పిన టి.జి.వెంకటేష్



### ఉత్తరాంధ్ర వాసులను రెచ్చగొడుతున్న వైకాపా నేతలు

**మూ**డు రాజధానుల వివాదం క్రమేణా ప్రాంతీయ వాదంగా మారుతోంది. వికేంద్రీకరణ ప్రతిపాదన విద్వేషాలను రేపి విధ్వంసాలకు దారి తీసే సూచనలు కనిపిస్తున్నాయి. అధికార పార్టీ తప్ప మిగిలిన పార్టీలన్నీ వికేంద్రీకరణకు వ్యతిరేకంగా తమ వాణి వినిపిస్తున్నాయి. ఇటు ప్రభుత్వం, అటు అన్ని ప్రతిపక్షాలూ ఎవరికి వారు తగ్గేదే లే! అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఇలా చిలికిచిలికి గాలివానలా మారుతున్న ఈ వ్యవహారం రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందో అని ఆంధ్ర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ఆం**ధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి ఎనిమిదేళ్లు దాటిపోయింది. రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత ఓటుకు నోటు కేసులో ఇరుక్కుని హైదరాబాదు నుండి ఆంధ్రాకి పారిపోయివచ్చాడు. పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా భాగ్యనగరంపై మనకు కూడా హక్కుందిలే అనుకున్నవారి ఆశలపై నీళ్ళు చల్లాడు. తమ సామాజికవర్గానికి ప్రాధాన్యత కల్పిస్తూ అమరావతిని రాజధానిగా ప్రకటించాడు. బాహుబలి సెట్టింగులను, స్టీవెన్ స్పీల్బర్గ్(జురాసిక్ పార్క్ దర్శకుడు) గ్రాఫిక్స్‌తో చూపించి జనం చెవిలో పువ్వు పెట్టాడు. అల్లావుద్దీన్ అద్భుత దీపం సినిమా తరహాలో రాత్రికి రాత్రే ఆకాశహర్మ్యాలు నిర్మించేస్తాం అంటూ అయిదేళ్ళు కాలక్షేపం చేశాడు. రాజధాని పేరుతో నిధులు దండుకోవడం, నీటిపారుదల ప్రాజెక్టులలో భారీ అవినీతి ఆరోపణలను మూటకట్టుకోవడం, అన్నింటినీమించి అడ్డదారిలో యువరాజుకి పట్టం కట్టి అమాత్య పదవి కట్టబెట్టడం వంటి పాపాలన్నీ శాపాలుగా మారి 2019 10లో

## మీడియా సాయి.. విజయసాయి



**రా**జ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డి ఇప్పుడు మీడియా సాయి చూస్తున్నారా...? ఈ ప్రశ్నకు అవుననే సమాధానమిస్తున్నాయి వైసీపీ వర్గాలు. దసపల్లా భూముల వ్యవహారంలో తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ మంగళవారం నాడు విజయసాయి మాట్లాడిన మాటలు ఆయన మీడియా సాయి చూస్తున్నారనడానికి బలాన్ని చేకూరుస్తున్నాయన్నది వారి అభిప్రాయం. సామాజిక మాధ్యమాల ద్వారా తన కార్యకలాపాలకు ప్రచారం కల్పించుకోవడంలో 10లో



# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

## మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం



వెంకటగిరి నియోకవర్గం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మాజీమంత్రి వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో మండలాల వారీగా అధికారులకు తగు సూచనలిచ్చి, లక్ష్యాన్ని నిర్దేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా అభివృద్ధి పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తయ్యేలా అధికారులంతా సమన్వయంతో కృషిచేయాలని కోరారు.

# పాతికేళ్ళ తర్వాత మళ్ళీ కలుసుకున్నారు

## బుచ్చిలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మండలకేంద్రమైన బుచ్చిరెడ్డిపాలెంలోని డివిఎస్ఆర్ హైస్కూల్లో పాతికేళ్ళ క్రితం పదవ తరగతి చదువుకున్న 50 మంది విద్యార్థులు ఇన్నేళ్లకు మళ్ళీ అదే హైస్కూల్లో కలుసుకుని చిన్ననాటి ముచ్చట్లు గుర్తుచేసుకుని ఆనందించారు. తాము చిన్నప్పుడు చదువుకున్న హైస్కూలంతా ఉత్సాహంగా కలయతిరుగుతూ సంబరపడ్డారు. ఈ నెల 9న పూర్వ విద్యార్థులు నిర్వహించుకున్న ఈ అపూర్వ సమ్మేళనం ఆత్మీయంగా జరిగింది. ఈ పాతికేళ్ళుగా ఎవరెవరు ఏఏ ఉద్యోగాల్లో ఎక్కడెక్కడ స్థిరపడ్డారో, వారి కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు చదువు చెప్పి జీవితాలు తీర్చిదిద్దిన అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించుకుని వారి ఆశీస్సులందుకున్నారు.

# ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి

## రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు



రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపి జెఏసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఈనెల9న నెల్లూరు కలెక్టరేట్‌లోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాము కృషిచేస్తున్నామని, ఉద్యోగులకు రావాల్సిన డిఏలను ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలన్నారు. ప్రభుత్వోద్యోగులు సర్వీసులో ఉండి మరణిస్తే వారి వారసులకు గ్రామ, సచివాలయాల్లో ఉద్యోగాలివ్వామనడం సమంజసం కాదని, గతంలో వలెనే కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్ పోస్టులను ఇవ్వాలన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

# కసుమూరు దర్గా అభివృద్ధికి కృషిచేస్తాం

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని కసుమూరు దర్గాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ ఖాదర్‌బాషా చెప్పారు. ఈనెల 9న ఆయన దర్గాను సందర్శించి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో దర్గా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, దర్గాలోని ముజావర్లు, గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, భక్తులకు మెరుగైన వసతులు కలుగజేస్తామని తెలిపారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ అహ్మద్‌బాషా, పఠాన్ అస్లాం, పఠాన్‌హుస్సేన్, శివ, పఠాన్‌బాబర్, దర్గా ముజావర్లు పాల్గొన్నారు.



# ధర్మపరిరక్షణే అందరి ధ్యేయం కావాలి

## వాల్మీకి జయంతి సభలో జేసీ కూర్మనాథ్

మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని, ముఖ్యంగా నేటి యువత వాటిని అవగాహన చేసుకుని ఆచరించాలని, ప్రతిఒక్కరూ ధర్మపరిరక్షణ ధ్యేయంతో ముందుకుసాగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పిలుపునిచ్చారు. ఈనెల 9వ తేది కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన మహర్షి వాల్మీకి జయంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదికవి వాల్మీకి రచించిన రామాయణం ప్రపంచ ఖ్యాతి పొందిందని, ఆ మహనీయుని జీవితం అందరికీ ఆదర్శనీయమని, మనిషి పరిపూర్ణ మానవునిగా మారేందుకు రామాయణం ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. తొలుత మహర్షి వాల్మీకి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వాల్మీకి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అష్టావధాని జనార్ధన్, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మాలకొండయ్యలను జేసీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంగీత కళాశాల ఆధ్వర్యంలో 'కళాదీప్తి' డాన్స్ అకాడమీ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థినులు విద్యాధరి, భవ్యహాసిని, వేదాక్షయ, కావ్యశ్రీ, పర్ణిక, గ్రీషిత తదితరులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'శుద్ధ బ్రహ్మ పరాత్పర రామా.. కాలాత్మక పరమేశ్వర రామా'..అంటూ ప్రదర్శించిన నృత్యం ప్రత్యేక ప్రశంసలందుకుంది. అనంతరం నృత్య కళాకారులను జాయింట్ కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, జిల్లా ఎస్సి సంక్షేమ సాధికారిత అధికారిణి రమాదేవి, సర్వ శిక్ష ఏపీసీ ఉషారాణి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు, బిసి సంఘ నాయకులు దేవరాజు సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



# సమాజానికి గ్రామీణ వైద్యుల సేవలు అవసరం

## ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి



గ్రామీణ వైద్యుల అవసరం సమాజానికి ఎంతోఉందని నెల్లూరులోని ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి పరావస్తు అన్నారు. ఈనెల 9న జిల్లా పీఎంపీల సంఘం 36వ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ ప్రాంతాల్లో గ్రామీణ వైద్యులు చేస్తున్న సేవలు అపారమని, గ్రామాలకు పీఎంపీలు పట్టుకొమ్మలని కొనియాడారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమో బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. న్యూరోసర్జన్ డాక్టర్ జి.వెంకటేశ్వర పసన్న, లాప్రోస్కోపిక్ సర్జన్లు డాక్టర్ పి.చైతన్య కుమార్‌రెడ్డి, డాక్టర్ పి.అమర్‌నాథ్‌రెడ్డి, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు డాక్టర్ కె.కళ్యాణి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ కె.చిరంజీవిలతో పాటు పీఎంపీ న్యాయ సలహాదారు పి.రమాదేవి, జిల్లా పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, కార్యదర్శి షేక్ సత్తార్, కోశాధికారి జె.రమాదేవి, ఓ.మస్తానయ్య, జి.శేషయ్య, ఎన్.ప్రసాద్, యు.రామదాసు, సి.వీరయ్య, డి.శ్రీనివాసులు, యు.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

నెల్లూరులోని పప్పులవీధిలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 8న శ్రీ చెంచుమహాలక్ష్మి క్యాటరింగ్ నిర్వాహకులు పైడా హేమంత్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' కనుక ఈ పుణ్యకార్యాన్ని చేపట్టామని, 108 వారాల పాటు అన్నదానం చేస్తామని, ఇది 78వ అన్నదాన కార్యక్రమమని నిర్వాహకులు తెలిపారు.

### 15వ ఆర్థికసంఘం

# నిధులొచ్చేశాయ్!..

## జిల్లాకు 13.11 కోట్లు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులొచ్చేశాయ్. దీంతో గ్రామపంచాయతీలకు అవసరమైన వసతుల కల్పనకు మార్గం సుగమమైంది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 13 కోట్ల11 లక్షల 78వేల 792 రూపాయలు విడుదలయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి ఎం.ధనలక్ష్మి తెలిపారు. జిల్లాలోని మొత్తం 718 పంచాయతీలకు జనాభా ప్రాతిపదికపై, ఆయా ప్రాంతాల ప్రాతినిధ్యాన్ని బట్టి ఈ నిధులను పంచాయతీలకు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. పిల్లల్లో రోగ నిరోధకశక్తిని పెంపొందించేందుకు, పోషకాహార లోపం నివారించేందుకు, గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాల్స్, ఆరోగ్య ఉప కేంద్రాలు, పశువైద్య కేంద్రాల నిర్మాణాలు, మరమ్మతులు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు, ఎల్ఇడి వీధి దీపాలకు వగైరా సౌకర్యాల కోసం, మొక్కల పెంపకానికి, విద్యుత్ బిల్లుల చెల్లింపులు వగైరాలన్నిటికీ ఈ నిధులు వెచ్చించాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

### కావలిలో...

# గంజాయి పట్టివేత



కావలిలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 30వేల రూపాయల విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 9న కావలి టు టౌన్ సిఐ ఏ.సుధాకర్ ఆ వివరాలను వెల్లడించారు. కావలి పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో సర్వాయపాలెంకు చెందిన యుగనేష్‌రెడ్డి, కావలి నివాసి సుమంత్‌లు గంజాయి అమ్ముతుండగా వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. జిల్లా ఎస్పీ విజయారావు ఆదేశాలతో కావలి ఇన్‌చార్జి డిఎస్పీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇటీవల గంజాయి తదితర మత్తు పదార్థాల నియంత్రణకు గట్టిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### జీతాలిప్పించండి

# మహాప్రభో!

'అయ్యా!.. ఏడు నెలలుగా మాకు జీతాలు లేవు. పెళ్లాం బిడ్డలెలా బతకాలి?'.. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ఈనెల 8న పొదలకూరులోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది మధ్యాహ్న భోజన విరామంలో ఆందోళన చేపట్టారు. మార్చి నెల నుంచి తమకు జీతాలివ్వలేదని, ప్రభుత్వం కరుణించి జీతాలిచ్చి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

### అవినీతికి అడ్డాగా మారిన.. పౌరసరఫరాల సంస్థ

# నెల్లూరులో... భారీ కుంభకోణం!

- 30 కోట్ల ప్రజాధనాన్ని.. గుటుక్కున మింగేశారు
- చిన్న ఉద్యోగి.. కుబేరుడైపోయాడు
- ఇప్పటిదాకా 5గురు సస్పెండ్
- అధికారుల పాత్రపై ఆరా!..

*నెల్లూరు జిల్లా పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లయిస్ కార్పొరేషన్) అక్రమార్కులకు అడ్డాగా, అవినీతి గనిగా మారిపోయింది. ప్రభుత్వంలో వేలాది రూపాయల జీతాలు తీసుకుంటూనే.. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని గుట్టుచప్పుడు కాకుండా గుటుక్కున మింగేశారు. పౌరసరఫరాల సంస్థకే తీరని అప్రదిష్ట తెచ్చారు. ఒకటి కాదు..రెండు కాదు.. ఇప్పటిదాకా 29.78 కోట్లు తినేశారని అంటున్నారు కానీ.. విచారణ పూర్తయ్యేనాటికి అది ఎన్ని కోట్లకు పెరుగుతుందో చెప్పలేం.. అన్నంతగా ఈ భారీ కుంభకోణం జరగడం రాష్ట్రమంతా సంచలనం కలిగిస్తోంది. ఎన్నేళ్ళ నుంచి జరుగుతుందో తెలియదు కానీ, ఇప్పటికి పాపం పండింది..ఎట్లనో ఈ కుంభకోణం ఇన్నాళ్ళకు బయటపడింది. జిల్లాలోనే కాదు, సివిల్ సప్లయిస్ సంస్థలోని ఈ అవినీతికంపుతో నెల్లూరు పేరు.. రాష్ట్రవ్యాప్తంగా గబ్బుపట్టిపోతోంది.*

'ప్రభుత్వ సంస్థల్లో చేరితే ఏమైనా చేయవచ్చు..ఎంతైనా తినేయొచ్చు..అడిగేవారుండరు. ఉన్నా, వారికీ ఇంత అని 'మామూళ్ళు' ఇచ్చేస్తే సరి!..ప్రజల డబ్బు కదా..ఎంతైనా దోచుకోవచ్చు'...అనుకునే అక్రమార్కులకు నెల్లూరులోని పౌరసరఫరాల సంస్థ లడ్డులా దొరికింది. అందిన కాడకి అందినంత తినేశారు. ఒక చిన్న ఉద్యోగి కోట్లు తినేయడమంటే.. చిన్న విషయమా?... ప్రతి పైసాకీ లెక్క ఉండే ఆన్‌లైన్ విధానంలోనే కోట్లాది రూపాయలు దారిమళ్ళాయంటే, అధికారులకు తెలియకుండానే ఇంత భారీ కుంభకోణం జరిగిందా?..దీంట్లో ఇంకా ఎంతమంది ప్రత్యక్షంగా, మరెంతమంది పరోక్షంగా ఉన్నారో లెక్క తేల్చేందుకు జిల్లా ఉన్నతాధికారులు కొరడా పట్టుకున్నారు. ఆన్‌లైన్‌లో ఇంతగా స్వాహాపర్వం జరుగుతున్నా..ఎవరూ గుర్తించకపోవడం వెనుక మతలబులేమిటన్నది కూడా విచారిస్తున్నారు. మొత్తంగా సివిల్ సప్లయిస్ సంస్థలో 29,78,28,804 రూపాయల దాకా ఈ కుంభకోణం జరిగినట్లు ఉన్నతాధికారులు తాజాగా అంచనా వేస్తున్నారు. ఇంకా లోతుగా విచారిస్తే ఇది ఇంకా ఎన్ని కోట్లు దాటుతుందో చెప్పలేం. ఇప్పటిదాకా అయిదుగురు ఉద్యోగుల్ని సస్పెండ్ చేశారు. ఈ అవినీతిపాపంలో ఇంకా ఎవరెవరికి ఎంతెంత వాటాలున్నాయో..ఇంకా ఎందరున్నారో, పాత అధికారులు, ఉద్యోగులతో సహా అందరినీ విచారించి త్వరలోనే నిగ్గు తేల్చనున్నారు.

## రైతన్నల డబ్బునంతా తినేశారు.. హమాలీల కష్టమంతా తాగేశారు

ఒక చిన్న ఉద్యోగి.. 2007లో సివిల్‌సప్లయిస్ సంస్థలో హమాలీ కూలీగా వచ్చిన వ్యక్తి, ఔట్‌సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరి.. జిల్లావ్యాప్తంగా రైతులకు, హమాలీలకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయలను దారిమళ్ళించాడంటే ఎంత గుండెధైర్యం కావాలి. ధాన్యం తోలిన రైతన్నల

10లో

## ఓం.. నమో వేంకటేశాయ!



# హైదరాబాదులో శ్రీవారి వైభవోత్సవాలు

## అక్కడా మన నెల్లూరోళ్ళే...

**ఉభయకర్తలుగా ముప్పవరపు హర్షవర్ధన్, ఎస్.సుబ్రహ్మణ్యంరెడ్డి, చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, బద్వేలు సుబ్బారెడ్డి దంపతులు**

వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతుల సారధ్యంలో ఆగస్టు మాసంలో అంగరంగ వైభవంగా నెల్లూరులో శ్రీవారి వైభవోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదేతరహా వైభవోత్సవాలు తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాదులో జరుగుతున్నాయి. నగరంలోని దోమలగూడ ఎన్.టి.ఆర్. స్టేడియంలో అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం ఈ మహత్కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 15వతేదీ రాత్రి వరకు ఈ వైభవోత్సవాలు జరుగుతాయి. ఆ ఏడుకొండల పైనుండి స్వామివారిని హైదరాబాదుకు తీసుకొచ్చి, ఈ భక్తి కార్యక్రమాన్ని నిర్వహించి, హైదరాబాదు పరిసర ప్రాంతాలలో నివసించే సామాన్యులకు సైతం స్వామివారి దర్శనాన్ని కల్పిస్తోంది కూడా మన నెల్లూరీయులే. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య కుమారుడు హర్షవర్ధన్ – రాధమ్మ, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సారధులు సుబ్రహ్మణ్యంరెడ్డి–పద్మావతి, వెంకటేశ్వరరెడ్డి–శ్రీలక్ష్మి, వంశీరామ్ బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డి–జ్యోతి దంపతులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఆ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడి దివ్య రూపాన్ని, నిత్యం స్వామివారికి జరిగే పూజలు, సేవలతోపాటు అన్ని కైంకర్యాలను భక్తులు ప్రత్యక్షంగాచూసే భాగ్యం కల్పిస్తోంది మన నెల్లూరీయులు కావడం అభినందనీయం.

### దర్శించుకున్న వెంకయ్య - ఉషమ్మ

అక్టోబర్ 12వ తేదీ ఈ వైభోత్సవాలలో వెంకయ్యనాయుడు – ఉషమ్మ దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల చెంతకే భగవంతుడిని తీసుకొచ్చి ఆ దేవదేవుడి దర్శనభాగ్యం కల్పిస్తున్న ఉభయకర్తలను వెంకయ్యనాయుడు అభినందించారు.




కీ॥శే॥ మాగుంట సుధాకర్‌రెడ్డి గారు

జననం : 09-09-1949 నిర్యాణం : 07-10-2022

మరువలేను...
మీతో అనుబంధం!

అన్నా...
అన్ని సమయాలలో నాకు మీరిచ్చిన స్ఫూర్తి.. సదా ఆచరణీయం
మీ స్నేహ సాంగత్యంలో నాకు లభించిన కీర్తి.. చిరస్మరణీయం

మీరు లేరన్న నిజం నమ్మలేనిది
మీరు లేని లోటు పూడ్చలేనిది

నాలుగు దశాబ్దాల మీ అనుబంధం మరువలేనిది
మీతో నాకున్న ఆత్మీయ బంధం మరపురానిది

ఎప్పటికీ చెరిగిపోనిది.. మీ అభిమానం
మా హృదయాలలో శాశ్వతం.. మీ స్థానం

అశ్రునయనాలతో...
సదా మీ స్నేహాభిలాషి.. సేవాభిలాషి



కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి
నీలాద్రి ప్యాకేజింగ్స్, చెన్నై.

లాయర్
అక్టోబర్ 14, 2022

# అందరికీ ఆహారం..అందని ద్రాక్షేనా?..

ఒకవైపు తగ్గని కరోనా.. మరోవైపు ఆగని యుద్ధం ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తుండగా, ఇంకోవైపు నుంచి ఆర్థిక మాంద్యం ముప్పు ముంచుకొస్తోందని నిపుణుల హెచ్చరికలు మానవాళిని భయకంపితుల్ని చేస్తున్నాయి. కరోనాతో పాటు ఉక్రెయిన్-రష్యా యుద్ధ ప్రభావాలతో ఇంధనం ధరల పెరుగుదల వల్ల పెరుగుతున్న ఆహారధాన్యాల ధరలను అందుకోలేక ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు పేదరికపు కోరల్లో నలిగిపోతున్నారని తాజాగా ప్రపంచబ్యాంకు తన అధ్యయనంలో వెల్లడించింది. యుద్ధం వల్ల ఇంధనం ధరలు పెరిగితే అన్నిటి ధరలూ ఆకాశానికంటుతాయి. అదే ఆ తర్వాత పెద్ద సమస్యగాపరిణమిస్తుందని ఆర్థికశాస్త్రవేత్తల ఆందోళన. ఈ సంక్షోభాల వల్ల 2030 నాటికి కూడా పేదరికం ఏమాత్రం తగ్గేలా లేదని నిపుణుల భావన. అన్నిరంగాల్లో అభివృద్ధి కుదేలైపోయింది. ద్రవ్యోల్బణం పెరిగింది. రానున్న ఏడాదిలో ఆర్థికమాంద్యం పెద్ద ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని, ఈ మాంద్యం చాలా తీవ్రంగా ఉండబోతోందని కూడా ఆర్థికశాస్త్రవేత్తలు చెప్తున్నారు. మనదేశంలో ఆర్థికవ్యవస్థ గతంలో కంటే ఇప్పుడు కొంత బలంగానే ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా కుదుటపడాల్సి ఉంది.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆహార సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తికి, మార్కెట్ వ్యవస్థలకు లంకె కుదరకపోవడంతో ఆహార సమస్యలు మిన్నంటుతున్నాయి. దీంతో అందరికీ ఆహారం అన్నది అందని ద్రాక్షగానే ఉంటోంది. గత కొద్దికాలంగా ప్రపంచంలోని 93 శాతం పేదదేశాలు, మధ్యతరగతి దేశాలతో పాటు, 89 శాతం పెద్ద దేశాలు కూడా ఆహార సమస్యలు ఎదుర్కొంటున్నాయని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 345 మిలియన్ల మంది ప్రజలు ఆహారసంక్షోభంతో అల్లాడుతున్నారని ఇటీవల ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. మనదేశంలోనూ ఆహారధాన్యాల ఉత్పత్తి అంతంతమాత్రంగానే ఉంది. సుమారు 19 కోట్ల మందికి పైగానే ప్రజలు సరైన పోషకాహారం లేక అవస్తలు పడుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా ప్రకటించింది. వ్యవసాయ రంగానికి మనదేశంలో ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం, మార్కెట్ సదుపాయాలు కరువవడం వంటివన్నీ ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వ్యవసాయానికి భారీ స్థాయిలో బడ్జెట్‌లో నిధులు కేటాయించి రైతాంగానికి వసతులు, ప్రోత్సాహాలు కల్పించకపోతే భవిష్యత్తులో మరింత కష్టమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉండే సమస్యలు చాలవన్నట్లు.. దేశంలో ఇటీవలి కాలంలో ఆహారం.. ఓ వ్యాపారంగా మారిపోయింది. కల్తీ ఆహారం పెరిగిపోతోంది. కలుషిత ఆహారం కారణంగా అనారోగ్యం పాలవుతున్నవారి సంఖ్య కూడా భారీగానే ఉంటోంది. మంచి ఆహారం తినేవారు కూడా పిజ్జాలు, బర్గర్లు, జంక్‌ఫుడ్‌లను అలవాటు చేసుకుంటున్నారు. వీటి వల్ల పెరిగే అనారోగ్య సమస్యలతో ఎంతో మంది పిల్లలు, పెద్దలు కూడా నానాబాధలు పడుతున్నారు. అందుకే, ప్రజలు అలాంటి పాశ్చాత్య సంస్కృతులకు దూరంగా ఉండడం అవసరం. ఇదిలావుంటే, పర్యావరణం దెబ్బతినడం, వేడిగాలులు, అకాలవర్షాలు, కరువులు, వరదల వంటి విపత్తుల వల్ల పంటల దిగుబడులు తగ్గుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పౌష్టికాహారం పుష్కలంగా ఉండే చిరుధాన్యాల సాగును మనదేశంలో ఇంకా భారీగా చేపడితే ప్రయోజనం ఉంటుందని, వీటి ఉత్పత్తిలో ఇప్పుడు భారత్ ముందంజలోనే ఉన్నా, రైతులకు మద్దతు ధర ఇచ్చి, అవసరమైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందనేది నిపుణుల సూచన.

ఏదేమైనా ఇప్పటికే దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయి కోట్లాది మంది నిరుపేదలు అర్ధాకలితోనే అలమటిస్తున్నారనేది ఎవరూ కాదనలేని సత్యం. ఆ దుస్థితిని నివారించేందుకు ప్రభుత్వాలు కృషిచేయాలి. దేశజనాభా నానాటికీ గణనీయంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలందరికీ ఆహారం సమకూర్చడం చిన్నవిషయమేమీ కాదు. అందులోనూ భద్రమైన, శుభ్రమైన ఆహారాన్ని, ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించాలంటే ఎంతో శ్రమించాల్సి ఉంటుంది కూడా. అయినా తప్పదు... ప్రజల మనుగడను కాపాడే సురక్షిత ఆహారంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టి, ఈ సమస్యల సవాళ్ళను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగడమే తక్షణ కర్తవ్యం.

(అక్టోబరు 16 ప్రపంచ ఆహార దినోత్సవం)

# వెంకయ్యనాయుడు ధన్యపురుషుడు!

అతి సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, కేవలం పట్టుదల, క్రమశిక్షణ, పోరాట పటిమ, నాయకత్వ లక్షణాలతో పాటు వాక్చాతుర్యంతో అనితరసాధ్యుడిగా ఎదిగిన రాజకీయ నాయకుడు, మన నెల్లూరు వాడు ముప్పవరపు వెంకయ్యనాయుడు. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేదు. ఆయన బంధువులు కూడా ఎవరూ రాజకీయాలలో రాణించలేదు. తనకైతాను స్వశక్తితో ఎదిగిన కృషీవలుడాయన. అయిదు దశాబ్దాలకుపైగా వివిధ హోదాలలో తన సమర్ధతను చాటుకున్నారు. భారత 13వ ఉపరాష్ట్రపతిగా తన పదవికి ఆయన వన్నె తెచ్చాడు. అలాంటి అరుదైన ఆత్మీయ వ్యక్తి పదవీ విరమణ తరువాత తన జన్మభూమి నెల్లూరుకి వస్తే జిల్లావాసులు చూపించిన ఆదరణ అపూర్వం. జిల్లా నలుమూలల నుండి ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం నెల్లూరీయులకు ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనం. బహుశా భవిష్యత్‌లో మళ్ళీ ఇలాంటి నాయకుడు మన జిల్లా నుండి ఇంతటి స్థాయికి ఎదగడం అసాధ్యమన్నది నా అభిప్రాయం. ధన్యజీవుడు, పుణ్యపురుషుడు.. మన వెంకయ్యనాయుడు. – యు. విశ్వేశ్వరరావు, హైదరాబాదు.

# ఫ్లెక్సీల నిషేధం సాధ్యమేనా...?

నెల్లూరునగర కొత్త కమిషనర్ కొంచెం నిబద్ధత కలిగిన అధికారిణిగా కనిపిస్తున్నారు. నిత్యం నగరంలో పర్యటిస్తూ పారిశుధ్య వ్యవహారాలను ఆమే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అక్రమ లే అవుట్లపైన కూడా బాగానే స్పందిస్తున్న మేడం... ఇంకా దురాక్రమణలపైనా, అక్రమ నిర్మాణాలపైనా దృష్టిపెట్టినట్లు లేదు. నవంబర్ ఒకటవ తేది నుండి ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం విధించింది. ఈ నిషేధ నిర్ణయం అమలు చేయడం ఆమెకు కొంచెం కష్టతరమైన పనే. నగరానికి వచ్చే ఏ కమిషనరైనా నగర నాయకుల చెప్పుచేతల్లో ఉండాల్సిందే. ఇది నెల్లూరులో ఆనం వారి హయాం నుండి అనాదిగా వస్తున్న ఆచారం. ఇప్పుడు కొత్తగా వచ్చిన కమిషనరమ్మ తన ఇష్టానుసారం ప్రవర్తిస్తానంటే నేతలు ఒప్పుకోరు. ఇలాంటి పరిస్థితుల్లో తమ పుట్టిన రోజులకి, పెళ్లి రోజులకి, సర్వమత పండగలకి భారీఫ్లెక్సీలు కట్టించుకుంటున్న లీడర్లు వాటిని కట్టడానికి వీలులేదంటే ఒప్పుకుంటారో లేదో చూడాలి. నగర కార్పొరేషన్ విషయంలో తల దూరిస్తే ముఖ్యమంత్రినైనా ఎదిరించే ధైర్యం చేయగల ఘనులు మన నేతలు. ఇలాంటి వాతావరణంలో ఈ ఫ్లెక్సీల నిషేధం ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాలి! – షేక్ గౌస్‌భాషా, వెంకటేశ్వరపురం.




## గాలి వానలతో
# కరెంటు కష్టాలు!

ఇటీవలి కాలంలో వర్షాలు బాగా పడుతున్నాయి. ఇదే సమయంలో ఒక్కొక్క సారి గాలి కూడా ఎక్కువగా ఉండడంతో కరెంటు కష్టాలు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా బివి నగర్, కొండాయపాళెం పరిసర ప్రాంతాలలో చిన్నపాటి గాలులకి, తేలికపాటి వర్షాలకు తరచూ కరెంటు పోతోంది. ఈ ప్రాంతాల్లో చెట్లు ఎక్కువగా ఉండడం, అవి కరెంటు తీగలపై వాలి ఇబ్బంది కలిగిస్తుండడంతో ఈ పరిస్థితి కలుగుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రీ కటింగ్, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ వంటి పనులు చేపట్టకపోతే మా కష్టాలు ఇంకా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసలే రానున్నది నవంబర్. వర్షాలు, గాలులు ఇంకా ఎక్కువగా వచ్చే మాసం. అధికారులు దయచూపి మమ్మల్ని కరెంటు కష్టాలనుండి బయటపడేయాలని మన 'లాయర్' ద్వారా కోరుతున్నాను.

ఆర్. పి. రామయ్య, కొండాయపాళెం.

# ధాన్యం కొనుగోళ్ళు.. రైతులకు కన్నీళ్ళు!



ధాన్యం కొనుగోళ్ళ విషయంలో జిల్లాలోని రైతులకు ఎన్నాళ్ళనుంచో కన్నీళ్ళే మిగులుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు అమ్ముకునేందుకు రైతు భరోసా కేంద్రాలున్నా, వాటిలో సరైన వసతులు లేకపోవడంతో రైతన్నలకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. వరికి పుట్టినిల్లయిన నెల్లూరుజిల్లాలో వరి విస్తారంగా పండుతోంది. జిల్లాలో ప్రత్యేక వాతావరణ పరిస్థితులున్నాయి. వీటిని ప్రభుత్వం గమనించకుండా కొనుగోళ్ళ లక్ష్యం నిర్ణయిస్తుండడం, పండిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోతుండడంతో ఈ వ్యవస్థ రైతులకు అవస్తగానే ఉంటోంది. జిల్లాలో ఏటా సుమారు 16 లక్షల మెట్రిక్ టన్నుల దాకా ధాన్యం దిగుబడి వస్తుంటుంది. కానీ కొనుగోళ్ళు చాలా తక్కువగానే ఉండడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతోంది. ధాన్యానికి సరైన మద్దతు ధర లేక రైతులు ఇంతకాలం బాగా అవస్తలు పడేవారు. పంటలు పండగానే దళారులు వచ్చి వాలిపోయేవారు. మరోవైపు వ్యాపారులు రైతులను మాయమాటలతో మభ్యపెట్టి, వారికి అడ్వాన్సులో, అప్పులో ఇచ్చి రైతుల నుంచి ధాన్యాన్ని ఎగరేసుకుపోయేవారు. నాశిరకమని, తేమశాతం ఎక్కువగా ఉందని బురిడీ కొట్టించి రైతులకు కుచ్చుటోపీ పెట్టేవారు. అయితే, రైతుల నుంచి తక్కువధరకు కొన్న ధాన్యాన్ని మిల్లుల్లో ఆడించుకున్నాక ఎక్కువ ధరకు బియ్యాన్ని అమ్మేసుకుంటూ వ్యాపారుల కోట్లాది రూపాయలను ఆర్జిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారుల మాయాజాలంలో పడకుండా రైతులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించడం, రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించడంతో రైతులు ఎంతో సంతోషపడ్డారు. అయితే, ఆ కేంద్రాలు కూడా లోపభూయిష్టంగా ఉండడం, రైతులకు సరైన వసతులు లేకపోవడం, తిరిగి మిల్లర్ల దగ్గరకే రైతులను పంపుతుండడంతో రైతులు మళ్ళీ వ్యాపారులు, లేదా దళారుల దోపిడీకి గురవుతూనే

## సమస్యల తో 'రణం'

ఉన్నారు. గత సీజన్‌లో రైతుల వద్ద నుంచి కనీసం 6 లక్షల టన్నుల ధాన్యం కొనాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించుకున్నా, ఆచరణకు వచ్చేసరికి అది కేవలం నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. పండించిన పంటలో కనీసం 30శాతం కూడా ప్రభుత్వం కొనకపోవడంతో రైతుల బాధలు రైతులవిగానే ఉన్నాయి. ఆ కొన్న ధాన్యానికి కూడా ఇంకా అనేకమంది రైతులకు బకాయిలు పడడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. ధాన్యం అమ్ముకున్న రైతుకు నెలల తరబడి డబ్బులు ఇవ్వకుంటే ఆ రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవాలి. అప్పులు చేసి పంటలు పండించుకున్న రైతులు వడ్డీలు కట్టుకోవాలి.. కుటుంబాలను పోషించుకోవాలంటే ఎలా?..చేతిలో డబ్బులు లేకుండా ఈ తిప్పలిలా ఎన్నాళ్లు పడాలి?.. ఆ బాధలు పడలేక జిల్లావ్యాప్తంగా వేలాదిమంది రైతులు తిరిగి మిల్లర్లకు, లేదా వ్యాపారులకే తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సివస్తోంది. దీనివల్ల ఏటా రైతులు భారీస్థాయిలో నష్టపోతూనే ఉన్నారు. అయితే, వాస్తవానికి ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతుభరోసా వ్యవస్థ మాత్రం అన్నిరకాలుగా రైతులకు మంచిదే. కానీ ఎన్నిరకాల చర్యలు తీసుకుంటున్నా ఆచరణకు వచ్చేసరికి క్షేత్రస్థాయిలో కొనుగోళ్ల వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా, అవకతవకలమయంగానే ఉంటోంది. దాన్ని వెంటనే సరిదిద్దుకోవాలి.ఇప్పటికీ రవాణాచార్జీల కింద ప్రభుత్వం ఇస్తానన్న డబ్బులు కోట్లల్లోనే బకాయిలున్నాయి. పొలాల వద్ద నుంచి రైతుభరోసా కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చేందుకు బస్తాకు 10 రూపాయలు, టన్నుకు 250 రూపాయల వంతున ఎగుమతి కూలీగా ఇస్తానన్న ప్రభుత్వం ఆ హమాలీ కూలీ ఛార్జీలను ఇంతవరకు ఇవ్వనే లేదు. ఈ కూలీ బకాయిలు కూడా దాదాపు 10 కోట్ల రూపాయల దాకా ఉన్నాయంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవుతుంది. రైతుభరోసా కేంద్రాల్లో ఇప్పటికీ రైతులకు అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా లేవు. ముఖ్యంగా తేమ శాతాన్ని నిర్ణయించే పరికరాలు, తగ్గ నిపుణులైన సిబ్బంది లేకపోవడం, గోతాలు, గోదాములు అందుబాటులో లేకపోవడంతో రైతులు తిరిగి దళారులను, వ్యాపారులను, మిల్లర్లను ఆశ్రయించక తప్పడం లేదు. తేమశాతాన్ని రైతుభరోసా కేంద్రాల్లో అప్పటికప్పుడు నిర్ణయించగలిగితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం ఉండదు. అందుకు తగ్గ అనుభవజ్ఞులు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సిబ్బంది ఏర్పాటు అత్యవసరం. రైతులు కూడా నేటి ఆధునిక సాంకేతిక విధానాల పట్ల అవగాహన కలిగించుకుని జిల్లాయంత్రాంగానికి సహకరించాలి. అంతేకాదు, రైతాంగానికి అవసరమైన గోడౌన్లు కానీ, ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు తగ్గ ప్లాట్‌ఫారమ్‌లు కానీ లేవు. వానకు తడిస్తే ధాన్యంలో తేమశాతం పెరిగి నాణ్యత తగ్గిపోతుంది. ఎప్పుడు వానపడుతుందో తెలియదు. దాంతో జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునేందుకు, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. 'రైతుబంధు' పథకం కింద జిల్లా యంత్రాంగం గ్రామగ్రామానా అలాంటి ప్లాట్‌ఫారమ్‌లు ఏర్పాటుచేయాలి. జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ళు భారీస్థాయిలో ఉంటాయి. కోట్లాదిరూపాయలు లావాదేవీలు జరుగుతుంటాయి. వీటిల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ప్రభుత్వం ఒక ఇంటర్నల్ ఆడిట్ వ్యవస్థను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు ఆడిట్ చేయిస్తూ ఉంటే దుర్వినియోగాలకు అవకాశం ఉండదు. ప్రభుత్వం ఈ సమస్యలన్నిటినీ పరిశీలించి రైతులకు అన్నివిధాలా మేలు జరిగేవిధంగా కొనుగోళ్ళ వ్యవస్థను రూపుదిద్ది మరింత పటిష్టంగా అమలుచేయాలి.

- సంచారి

# మాగుంట సుధాకరరెడ్డి ఇక లేరు



ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రజానేత దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి తమ్ముడు, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డికి అన్న మాగుంట సుధాకరరెడ్డి అక్టోబర్ 7వ తేదీ, శుక్రవారం మధ్యాహ్నం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 73 సంవత్సరాలు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. వారి మరణం మాగుంట కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మాగుంట సోదరులలో సుధాకర్‌రెడ్డి రెండవవారు.

సుధాకర్‌రెడ్డి స్వర్గీయ మాగుంట రాఘవరెడ్డి – కౌసల్యమ్మల రెండవ సంతానంగా 1949 సెప్టెంబర్ 9న జన్మించారు. సినీ నిర్మాతగా, పంపిణీదారుడిగా, ఎగ్జిబిటర్‌గా కూడా సుధాకర్‌రెడ్డి మంచి ఖ్యాతి పొందారు. మాగుంట కుటుంబ వ్యాపార వ్యవహారాలతో పాటు 1991లో మాగుంట సుబ్బరామిరెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేసి ఒంగోలు పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన నాటి నుండి, రాజకీయ సేవా రంగాలలో దివంగత సుబ్బరామిరెడ్డికీ, ఆ తరువాత ఆయన సతీమణి పార్వతమ్మకీ, ప్రస్తుత ఒంగోలు పార్లమెంటు సభ్యులు



మాగుంట రాఘవరెడ్డి కుటుంబం (వృత్తంలో సుధాకర్‌రెడ్డి)

మాగుంట శ్రీనివాసులరెడ్డికీ అండగా ఉంటూ సహాయ సహకారాలు అందించేవారు సుధాకర్‌రెడ్డి. ముఖ్యంగా సుబ్బరామరెడ్డి దివంగతులైన తరువాత అన్ని విషయాలలో ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా మారారు. మాగుంట కుటుంబం వ్యాపార సామ్రాజ్యంలో బాగా రాణించిన తరువాత సుధాకర్‌రెడ్డి దృష్టి సినిమా రంగం వైపు మరలింది. నిర్మాతగా, పంపిణీదారుడిగా కూడా ఆయన విజయం సాధించారు. సుబ్బరామరెడ్డికి తమ్ముడంటే ప్రాణం. సుధాకర్‌రెడ్డి ఏ వ్యాపారం చేస్తానన్నా అడ్డు చెప్పేవారు కాదు. మాగుంట శీనయ్యకి అన్నలిద్దరంటే గౌరవం. వారు ఏం ఆదేశిస్తే ఆయన అది ఆచరించేవారు. అటు అన్న, ఇటు తమ్ముడు తెరముందు ఉండి వ్యాపార, రాజకీయ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటే సుధాకర్‌రెడ్డి తెరవెనుక ఉంటూ తనకిష్టమైన రంగాలలో ప్రయోగాలు చేసేవారు. మారుతున్న కాలంతో పాటు అందుబాటులోకి వస్తున్న ఆధునిక వ్యాపారాలవైపు ఆయన ఎక్కువగా దృష్టి పెట్టేవారు. ఆయన మనసు,



అన్నకు తోడుగా అటూ ఇటూ శీనయ్య, సుధాకరయ్య

హస్తవాసి చాలా మంచిదని, ఆయన చేతులతో ప్రారంభిస్తే తమ సంస్థ బాగా రాణిస్తుందని చాలా మంది గట్టిగా నమ్మేవారు. తమ వ్యాపారాలను సుధాకర్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయించుకునేవారు.

ఎం.ఎస్.ఆర్. 1, 2, 3గా ముగ్గురు అన్నదమ్ములను మాగుంట కుటుంబ అభిమానులు, వారి ఉద్యోగులు, సిబ్బంది పిలుచుకుంటారు. 27 సంవత్సరాల క్రితం పెద్దన్నను పోగొట్టుకున్న శీనయ్య



నెల్లూరులో జరిగిన ప్రేమాభిషేకం సినిమా 300రోజుల పండుగ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావుతో సుధాకర్‌రెడ్డి

ఇప్పుడు చిన్నన్నను కూడా కోల్పోయారు. మాగుంట సోదరులుగా వీరి బంధం ఎంతోమందికి ఆదర్శం అన్నట్లుగా ఈ ముగ్గురు సోదరులు ఉండేవారు.

మాగుంట సుధాకరరెడ్డికి భార్య స్నేహలత, కుమారుడు కిరణ్, కుమార్తె దీప్తి ఉన్నారు. మాగుంటోళ్ళ సంస్థలలో చాలాకాలం చక్రం తిప్పిన పి.వి.ప్రసన్నరెడ్డి సుధాకర్‌రెడ్డి తోడల్లుడే. ఇంటి పెద్దను కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న మాగుంట కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ.. సుధాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తోంది 'లాయర్'.

## పలువురు ప్రముఖుల నివాళి

మాగుంట సుధాకర్‌రెడ్డి మృతికి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలతో పాటు పలువురు జిల్లా ప్రముఖులు తమ సంతాపాన్ని ప్రకటించారు. అలాగే దేశావ్యాప్తంగా ఉన్న అనేక రంగాల ప్రముఖులు, మాగుంట అభిమానులు కూడా సుధాకర్‌రెడ్డి మృతిపట్ల తమ సంతాపాన్ని తెలిపారు.

## వెంకయ్య పరామర్శ..!

అక్టోబర్ 9వతేది ఆదివారం, మద్రాసులోని మాగుంట నివాసంలో సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పరామర్శించారు. సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. సుధాకర్‌రెడ్డి తన సహాధ్యాయి అని పేర్కొంటూ ఆయనతో ఉన్న స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. సుధాకర్‌రెడ్డి సతీమణి స్నేహలతమ్మను ఓదార్చారు. ఈ సందర్భంగా మాగుంట పార్వతమ్మని, శ్రీనివాసులరెడ్డిని ఇతర కుటుంబసభ్యులను, మాగుంట ఆప్తులను కలుసుకుని తన సంతాపాన్ని తెలియజేశారు.








నివాళి



మాగుంట సుధాకర్‌రెడ్డి గారు

జననం : 09-09-1949 నిర్యాణం : 07-10-2022

అన్న నిష్క్రమణతో శోకసముద్రంలో ఉన్న
ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి గారికీ,
వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...
సుధాకర్‌రెడ్డి గారి దివ్య స్మృతికి నా నివాళి.

డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కొర్సపాటి
అధ్యక్షులు
నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (NATA)
డల్లాస్, టెక్సాస్, యుఎస్ఏ





## గొలగమూడికి సాయిభక్తుల పాదయాత్ర

నెల్లూరులోని సాయిదర్బార్ అద్దాలమందిరం నుంచి సాయిమాల ధారణ చేసిన 300 మంది భక్తులు ఇటీవల పాదయాత్ర చేస్తూ గొలగమూడికి వెళ్ళారు. సాయినామ సంకీర్తనలు గానం చేస్తూ, 'ఓం నారాయణ-ఆది నారాయణ' అంటూ భగవన్నామ స్మరణ చేస్తూ భక్తులు జాతీయరహదారి మీదుగా గొలగమూడిని దర్శించుకున్నారు. అక్కడ అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. వెంకయ్య స్వామికి పట్టువస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. పండరి భజనలు, కోలాటాలతో హోరెత్తించారు. అనంతరం అన్న ప్రసాదం స్వీకరించి, తిరిగి నెల్లూరుకు చేరుకున్నారు. భక్తజన కోలాహలంతో ఎంతో ఉత్సాహంగా ఈ యాత్ర జరిగింది. సాయితత్వం, వెంకయ్యస్వామి బోధనలను చాటాలనే సంకల్పంతో తాము ఈ యాత్ర చేపట్టినట్లు సాయిదర్బార్ అద్దాల మందిరం ఛైర్మెన్ మధుసాయి చెప్పారు. మందిరం గౌరవ సలహాదారు పాబోలు సుబ్బరామయ్య, సాయిదర్బార్ సత్సంగ్ సేవాదళ్ సభ్యులు పర్యవేక్షించారు.

## భక్తిశ్రద్ధలతో.. 'మిలాద్-ఉన్-నబీ'



పవిత్రమైన మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా ఈనెల 9న నెల్లూరులో ముస్లిమ్ సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని కామాటివీధి మసీదు నుంచి కోటమిట్ట మీదుగా వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిమ్‌లు ప్రపంచశాంతిని కాంక్షిస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో గుర్రాలు, ఒంటెలు, పతాకాలతో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. సయ్యద్ సమీ హుస్సేని, సకీల్ అష్రఫీ, హాఫిజ్ షకీల్ అహ్మద్, ఇస్మాయిల్ ఖాదరీ, షానవాజ్, హాజీ ముస్తాక్ అహ్మద్, దస్తగిరి అహ్మద్, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రమౌళీశ్వరుని సన్నిధిలో చండీయాగం



ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 9న నెల్లూరు మూలాపేటలో ఉన్న శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో వైభవంగా చండీయాగం జరిగింది. జగన్మాత దుర్గాపరమేశ్వరి అమ్మవారి అనుగ్రహం కోసం నిర్వహించిన ఈ యాగంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భీమవరం నుంచి ప్రముఖ వేదపండితులు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో యాగం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు సాయికిరణ్‌స్వామి, విష్ణు, మురళి స్వామివారికి అభిషేకాలు చేశారు. ఆలయ నిర్వాహకులు నందకిశోర్, ఉషాకుమారి తదితరులు పర్యవేక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## వీఎస్‌యులో క్రీడల అభివృద్ధికి బాటలు



నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యు)లో క్రీడల అభివృద్ధికి వీసీ జి.ఎం సుందరవల్లి బాటలు వేస్తున్నారు. ఈనెల 11న స్పోర్ట్స్ బోర్డు సమావేశం ఏర్పాటుచేసి క్రీడలకు మరింత ప్రోత్సాహాన్నిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. వీఎస్‌యులో సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుచేయాలని, క్రికెట్ గ్రౌండ్‌ను ఆధునీకరించి అంతర్‌కళాశాల పోటీలకు సిద్ధం చేయాలని సంకల్పించి, అందుకు నిధులు మంజూరు చేశారు. అంతేకాక, 'ఖేలో ఇండియా' పథకం ద్వారా కేంద్రం నుంచి నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 400 మీటర్ల రన్నింగ్‌ట్రాక్, 50 మీటర్ల స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం ఏర్పాట్లకు నిధులు మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు. స్పోర్ట్స్ బోర్డు బడ్జెట్, క్రీడల పోటీల నిర్వహణ తదితర విషయాలను చర్చించారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ బోర్డు సభ్యులు వీఎస్‌యు రిజిస్ట్రార్ డా.పి.రామచంద్రారెడ్డి, ఆచార్య జి.విజయానందకుమార్‌బాబు, ఆచార్య సిహెచ్ శ్రీనివాసరావు, డా.పి జాన్సన్, ఆచార్య ఎం. శివశంకర్‌రెడ్డి, డా. సిపి లక్ష్మీప్రసన్న, డా.ఎం మధుసూదనవర్మ, ఎం.రవీంద్రబాబు, డా.సి. విజయకళ, డా. పి.నారాయణరాజు, డా.పి ప్రసాద్‌రెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా.కె సునీత పాల్గొన్నారు.

## వాకర్స్ సభ్యులకు సన్మానాలు



వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్‌బోర్డుకు విరివిగా విరాళాలందజేసిన వాకర్స్ సభ్యులు సుమారు 145 మందికి ఈ నెల 9న నెల్లూరులోని ఆ సంస్థ కార్యాలయంలో సన్మానాలు చేశారు. వాకర్స్ గవర్నర్ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మంచి ఆరోగ్యానికి నడక ఎంతో ముఖ్యమని వక్తలు పేర్కొంటూ, వాకర్స్ సభ్యులందరూ ప్రజలకు నడక ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 4వ క్యాబినెట్ సమావేశం సందర్భంగా వాకర్స్ సభ్యులను అభినందించారు. దాతలు పలగాని శ్రీనివాసరెడ్డి 10 లక్షలు, ఎంవి సుబ్బారెడ్డి 5 లక్షల రూపాయలను ఇంటర్నేషనల్ ట్రస్ట్ బోర్డుకు విరాళంగా అందజేశారు. సంస్థ పూర్వాధ్యక్షుడు చెలికాని సీతారామయ్య, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, ఆర్‌సి రాఘవేంద్రషెట్టి, ఎలక్ట్ గవర్నర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా 203 మాజీ గవర్నర్లు రాఘవరెడ్డి, సుబ్రహ్మణ్యాదవ్, అంకిరెడ్డి, సత్యనారాయణ, గూడూరు లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, తుంగా నారాయణరెడ్డితో పాటు 60 వాకర్స్ సంఘాలకు చెందిన 250 మంది అధ్యక్ష కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పేర్నాటి - పర్వతరెడ్డిలను గెలిపించుకోవాలి

### నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి.. జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకోవాలని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు బాధ్యతలు అప్పగించారని, వైకాపా తరఫున పోటీ చేస్తున్న వీరిరువురు విజయం సాధించేందుకు అందరూ కృషిచేయాలన్నారు. నెల్లూరులోని తన నివాసంలో రామ్‌కుమార్ రెడ్డి జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశమై ఎమ్మెల్సీ అభ్యర్థులైన పేర్నాటి-పర్వతరెడ్డిల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అందరితో కలసి ఎన్నికల విషయం చర్చించారు. నవంబరు 7వ తేది లోపు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

## చేవూరుకు ఆదోని సభ బాధ్యతలు



రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 18, 19, 20, 21 తేదీలలో రాష్ట్రంలోకి వస్తున్న సందర్భంగా ఆదోనిలో జరిగే భారీ బహిరంగ సభకు పర్యవేక్షణ బాధ్యతలు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు చేవూరు దేవ కుమార్‌రెడ్డికి అప్పగిస్తూ కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలిచ్చింది.

### రాహుల్ యాత్రను జయప్రదం చేయండి - చేవూరు




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' ఈనెల 18న మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తుందని, ప్రజలంతా ఈ యాత్రను జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి కోరారు. ఈనెల 11న ఆయన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఈ యాత్ర కార్యవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ, దేశప్రజలను ఐక్యంగా చేస్తూ పార్టీల కతీతంగా రాహుల్‌గాంధీ ఈ యాత్రను మొదలుపెట్టారని, దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోందని చెప్పారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెడుతూ ప్రజలను విడదీస్తూ దేశాన్ని అన్ని విధాలుగా నాశనం చేస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో దేశప్రజలంతా ఐక్యంగా ఉండాలని రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర ప్రారంభించారన్నారు. ఈ యాత్రలో భాగంగా కర్నూలుజిల్లా ఆదోనిలో జరిగే బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావు, ఏటూరి శ్రీనివాసులురెడ్డి, చేవూరు శ్రీధర్‌రెడ్డి, షేక్ ఫయాజ్, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గురువులకు పాదాభివందనం



నెల్లూరు ఏసినగర్‌లోని మునిసిపల్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఈనెల 9న జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గురువులకు పాదాభివందనాలు చేసి తమ జీవితాలకు పునాదులు వేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. స్థానిక త్యాగరాయ కల్యాణమండపంలో ఈ కార్యక్రమం జరిగింది. 1986-87 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులంతా చాలా కాలం తర్వాత కలుసుకుని ఆత్మీయంగా గడిపారు. పాఠశాలలో చదువుకున్న నాటి రోజులను, చిన్ననాటి స్నేహాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఓ విద్యార్థిని చదువుకోసం ఆర్థికసాయం అందించారు. ఈ అపూర్వసమ్మేళనంలో పూర్వవిద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు గురునాథం, దుర్గాదేవి, అచ్చయ్యలను పూర్వవిద్యార్థులు దుశ్శాలువలతో సన్మానించారు.






## ఈకేవైసీ.. రైతులకు తప్పనిసరి

ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈనెల 14వ తేదీలోగా తమ పంటల వివరాలు తెలియజేస్తూ రైతుభరోసా కేంద్రాలకు వెళ్ళి ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి లక్షా 92వేల ఎకరాల్లో పంటలు సాగుచేశారని, ఇందులో 99.5 శాతం ఈ-క్రాప్ ధృవీకరణ జరిగిందని, పంటల బీమా, పంటల కొనుగోలు తదితర పథకాలకు అర్హత పొందాలంటే రైతులు వెంటనే ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి..

# ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

## కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



రాష్ట్రవ్యాప్తంగా అటు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, ఇటు అభివృద్ధి పనులు చేయడం, తద్వారా రాష్ట్ర ప్రజలు అభ్యున్నతిని సాధించాలన్న లక్ష్యంతో సిఎం వైఎస్ జగన్ సారధ్యంలో ప్రభుత్వం నిరంతర కృషిలో నిమగ్నమై ఉందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 9న బుచ్చిరెడ్డిపాళెంలోని మినగల్లు గ్రామంలో 21.80 లక్షల రూపాయలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడారు. రాష్ట్ర రైతాంగానికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవినధిష్ఠించిన తర్వాత రాష్ట్రంలో సేద్యానికి, వైద్యానికి, విద్యకు ప్రాతినిధ్యం ఇచ్చి ఆయా రంగాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు విడుదల చేస్తు న్నారన్నారు. ప్రత్యేకించి కోవూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో దాదాపు 17.87కోట్ల రూపాయలతో 82 రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు.

## వైకాపాలో చేరిన తెదేపా సర్పంచ్

బుచ్చిరెడ్డిపాళెం మండలం చెల్లాయపాళెంకు చెందిన తెలుగుదేశం పార్టీ సర్పంచ్ రావూరు రజనీకాంత్, 10వ వార్డు సభ్యుడు తూపిలి ప్రశాంత్‌లు మరో 20మందితో కలసి ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో వైకాపాలో చేరారు. వారిని ప్రసన్న సాదరంగా పార్టీ కండువాలతో పార్టీలోకి స్వాగతించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

కోవూరు నియోజకవర్గంలో చేపట్టిన "గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న నిరంతరం అలుపెరుగకుండా తిరుగుతున్నారు. ప్రభుత్వం ప్రజలకు అమలుచేస్తున్న పథకాలను కూలంకుషంగా వివరిస్తున్నారు. ఈనెల 9న, 32వ రోజు కార్యక్రమాన్ని బుచ్చిరెడ్డిపాళెం మండలం కొట్టాలు గ్రామంలో నిర్వహిం చారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు..లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా లబ్దిదారుల కుటుంబాలకు అందుతున్న సంక్షేమం వివరాల కరపత్రాలను అందజేశారు. ఈ మూడేళ్ళ కాలంలో ఆ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఆయన ప్రజలకు వివరించారు. గడప గడపకు తిరుగుతున్న ఎమ్మెల్యే ప్రసన్నను ప్రజలు స్వాగతించి.. ఆశీర్వదిస్తున్నారు.

# రెడ్‌క్రాస్‌లో రెండో విడత.. కృత్రిమ అవయవాలు

ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ నెల్లూరు జిల్లా శాఖ చేపట్టిన సామాజిక, మానవతా సేవల్లో భాగంగా అనేకమంది దివ్యాంగు లకు మేలు కలుగుతోంది. రాయచూర్‌కు చెందిన రాజ్ భండారి ఫౌండేషన్ సహకారంతో, భగవాన్ మహవీర్ విక లాంగుల సహాయక సమితి-జయపుర వారి సహకారంతో నెల్లూరు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగులకు కృత్రిక అవయవాలు అమర్చాలని సంక ల్పించింది. దురదృష్టవశాత్తూ కాళ్ళు, చేతులు కోల్పోయి బతుకంతా బాధల మయంగా గడుపుతున్న బాధితులకు నెల్లూరు రెడ్‌క్రాస్ చేయందిస్తోండడం విశేషం. ప్రత్యేకించి జైపూర్ నుంచి కృత్రిమ అవయవాలను తయారుచేయించి తెచ్చి దివ్యాంగులకు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 400 మంది దివ్యాం గులకు కృత్రిమ అవయవాలు అందజేయాలన్న రెడ్‌క్రాస్ లక్ష్యంలో భాగంగా మొదటి విడ తగా గత నెలలో 200 మందికి అమర్చడం జరిగింది. తాజాగా ఈనెల 9న మరో 200 మందికి కృత్రిమ కాళ్ళు, చేతులు అమ ర్చడం పూర్తయింది. ఈ సంద ర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగులకు సేవలందించడం తమకెంతో సంతృప్తినిస్తోందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మున్ముందు మరెన్నో నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

○ మరో 200 మందికి చేయూత



## స్పాస్టిక్ సెంటర్‌కు 'లయన్స్' వితరణ

నెల్లూరులోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉన్న ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో పిల్లలకు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రామచంద్రప్రకాష్, కార్యదర్శి సుబ్రహ్మణ్యంలు యూనిఫారాలను, కుర్చీలను రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్‌కు ఈనెల9న అందజేశారు.

# 'తంగిరాల మహాభారతం' 25వ భాగం




ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు భీష్ముని దగ్గర పెరిగి వేదవేదాంగాలు, శాస్త్రాలు అభ్యసిస్తారు. మంచి పరాక్రమవంతులు అవుతూ యవ్వనములోకి ప్రవేశిస్తారు. పరోక్షంలో భీష్ముడే చక్కగా రాజ్యపరిపాలన చేస్తాడు. అందరి కన్నా ధృతరాష్ట్రుడు మహా బలపరాక్రమవంతుడవుతాడు. పాండురాజు ధనుర్విద్యలోను, ఆయుధాలు ప్రయోగించటం లోను ప్రావీణ్యుడవుతాడు.

మరికొంత కాలానికి, ధృతరాష్ట్రునికి వివాహం చెయ్యాలని సంకల్పించినప్పుడు, గాంధార రాకుమార్తె గాంధారికి పరమశివుని వలన 100మంది కుమారులను పొందే వరముందని తెలుసు కుని, గాంధార రాజుకి వర్తమానం పంపినప్పుడు గాంధారరాజు అంగీకరిస్తాడు. అప్పుడు గాంధారికి, ధృతరాష్ట్రునికి వివాహం జరుగుతుంది. గాంధారి 10మంది చెల్లెళ్ళని కూడా ధృతరాష్ట్రుని కిచ్చి పెళ్లి చేస్తారు. భీష్ముడు ఇంకో 100 మంది కన్యలను తీసుకువచ్చి ధృతరాష్ట్రుని కిచ్చి పెళ్లి చేస్తాడు.

యాదవ రాజైన సూరమహారాజు తన పెద్దకుమార్తె కుంతీ, మేనమామ కుంతిభోజుడి దగ్గర పెరుగుతుంది. ఒకరోజు దూర్వాస మహాముని వచ్చి ఆమె చేసిన సేవలకు ఆనందించి ఆమెకు ఒక మంత్రం ఉపదేశిస్తాడు, దాని వలన ఆమె ఏ మహనీయుని తలచుకుంటే, ఆయన ప్రత్యక్షమై తన లాంటి కుమారుణ్ణి ప్రసాదిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




కసుమూరు దర్గాలో..

# 22 నుంచి గంధోత్సవం



వెంకటాచలం మండలం కసుమూరులోని పవిత్రమైన హజరత్ సయ్యద్ కరిముల్లా షా ఖాదరీ మస్తాన్‌వలీ దర్గాలో ఎంతో వైభవంగా గంధోత్సవం నిర్వహించేందుకు జిల్లా అధికారయంత్రాంగం భారీ ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 11న దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసి, గంధోత్సవం ఏర్పాట్లను వివరించారు. సుమారు 300 ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ దర్గా హిందూ ముస్లిమ్ సోదరుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని, అక్టోబరు 22 నుంచి మూడురోజుల పాటు జరగనున్న గంధోత్సవానికి సుమారు లక్షమందికిపైగానే భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కొరత లేకుండా చూస్తామని, త్వరలోనే అధికారులతో సమావేశమై తగు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తొలుత మస్తాన్‌వలీ దర్గా కమిటీ సభ్యులు కలెక్టర్‌ను సాదరంగా స్వాగతించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి, తహశీల్దారు నాగరాజు, ఎంపిడిఓ సుస్మిత, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







09-09-1949 07-10-2022

# శ్రద్ధాంజలి

ప్రేమాభిమానాలతో
అందరినీ పలకరించే నిగర్వి
నాకు సోదర సమానులైన
**మాగుంట సుధాకర్‌రెడ్డి గారి**
ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...
వారి కుటుంబ సభ్యులందరికి
ప్రగాఢమైన సానుభూతి తెలియజేస్తున్నాను.



జె.కె.రెడ్డి
ఆడిటర్, చెన్నై



# ఎన్‌బికెఆర్‌లో అవగాహన సదస్సు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 10న మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 42 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న తమ కళాశాలకు ఎన్నో జాతీయస్థాయి గుర్తింపులు లభించాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ ఉన్నాయన్నారు. విద్యతో పాటు కళాశాలలో అనేక సెమినార్లు, పోటీలు నిర్వహిస్తున్నామని, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల ద్వారా విద్యార్థుల పరిపూర్ణ ఎదుగుదలకు కృషిచేయడం జరుగుతుందని చెప్పారు. కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారధ్యంలో విద్యార్థుల భవిష్యత్తుకు అన్నివిధాలా ఉపయోగంగా ఉండేలా కళాశాలను తీర్చిదిద్దారన్నారు. తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులుకు ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని, విద్యార్థులంతా కష్టపడి చదువుకుని రాణించి కళాశాలకు, తల్లితండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు.

# కందుకూరుకు కొత్త సబ్ కలెక్టర్

జిల్లాలోని కందుకూరుకు కొత్త సబ్ కలెక్టర్‌గా ఎస్ఎస్ శోభిక నియమితులయ్యారు. ఇక్కడ మొన్ననే నియమితులైన ఎస్ మాధవన్‌ను ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్ కలెక్టర్‌గా నియమించారు. శోభికను కూడా మూడురోజుల క్రితం గూడూరు సబ్ కలెక్టర్‌గా నియమించినా, వీరిరువురూ భార్యా భర్తలు కావడంతో వారి కోరిక మేరకు దగ్గరగా ఉండే కందుకూరు-మార్కాపురంలలో పోస్టింగ్‌లు కోరుకోవడంతో ఈ స్వల్ప మార్పు జరిగినట్లు సమాచారం.

# శ్రీసిటీలో ఆకట్టుకున్న.. 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్

## ○ రాకెట్లు, ఉపగ్రహాల నమూనాల ప్రదర్శన



ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి) షార్ ఆధ్వర్యంలో ఈనెల 10న శ్రీసిటీ ట్రేడ్ సెంటర్‌లో 'స్పేస్ ఆన్ వీల్స్' ఎగ్జిబిషన్ అందరినీ బాగా ఆకట్టుకుంది. క్రియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు దీనిని ప్రారంభించగా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, పలువురు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్‌డిఎస్‌సి షార్ జనరల్ మేనేజర్, ఎగ్జిబిషన్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మెన్ ఎల్.శ్రీనివాసులు అతిథులను స్వాగతించారు. ఎగ్జిబిషన్‌ను సందర్శించిన అనంతరం ప్రొ.నిర్మలరావు మాట్లాడుతూ.. ఇస్రోకు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల ఉత్సాహాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఈ ప్రదర్శనను రూపొందించినట్లు పేర్కొన్నారు. స్వీయ వివరణాత్మక నమూనాలు, చార్టులద్వారా అంతరిక్ష పరిశోధనా సంస్థ గురించి తెలుసుకోవడానికి శ్రీసిటీ పరిసరాల్లోని విద్యా సంస్థల విద్యార్థులు, అధ్యాపకులు, కార్మికులు, సాధారణ ప్రజలకు ఇది ఒక అద్భుతమైన అవకాశమని ఆమె వ్యాఖ్యానించారు. స్పేస్ ఎగ్జిబిషన్ నిర్వహించడానికి దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన వివిధ ప్రదేశాలలో శ్రీసిటీని ఒకటిగా ఎంపిక చేసినందుకు షార్ యాజమాన్యానికి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సంక్లిష్టమైన అంతరిక్ష సాంకేతికతను విద్యార్థులకు వివరించడంతో పాటు గ్రామీణ విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించిన శ్రీనివాసులు మరియు షార్ బృందానికి అభినందనలు తెలియజేశారు. ఎగ్జిబిషన్‌లో రాకెట్ ప్రయోగ వేదికలు, ఉపగ్రహాల ప్రతిరూపాలను ప్రదర్శనలో ఉంచారు. మార్స్ ఆర్బిటర్ మిషన్, చంద్రయాన్-2, ప్రతిపాదిత గగన్‌యాన్ (మిషన్ టు స్పేస్), వికాస్ ఇంజన్, క్రయో స్టేజ్ తదితర నమూనాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఇంటరాక్టివ్ కమాండ్ బేస్ సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యార్థులు స్వయంగా వివిధ ప్రదర్శనల పనితీరును గ్రహించేలా చేయడం 'స్పేస్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# 'స్వచ్ఛ సర్వేక్షన్'కు.. అభినందనలు



స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాష్ట్రానికి జాతీయ అవార్డులు దక్కాయి. ఈ నెల 1వ తేదీ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. తిరుపతి కార్పొరేషన్‌కు జాతీయ అవార్డు, పులివెందుల పురపాలక సంఘానికి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు, విశాఖ, విజయవాడ, సాలూరులకు అవార్డులు దక్కాయి. ఈ నేపథ్యంలో తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఇటీవల అభినందన సభ జరిగింది. రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షన్ కింద ఆయా అవార్డులు రావడంతో సిఎం జగన్... స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, మేయర్లు, ఛైర్‌పర్సన్లు, కమిషనర్లను అభినందించారు.

# చిన్నారులకు విద్యాసామాగ్రి పంపిణీ

చేగువెరా స్ఫూర్తితో యువత సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన అన్నారు. గూడూరు రెండో పట్టణం జానకిరాంపేట ప్రాంతంలోని గురుకుల పాఠశాలలో చేగువెరా వర్ధంతిని పురస్కరించుకుని చేగువెరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు దాతృత్వంతో టూటౌన్ సి.ఐ వెంకటేశ్వరరావుతో కలసి విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ ప్రతినిధులు ఆదినారాయణ, అన్వర్ భాషా, నరేష్‌రెడ్డి, మల్లికార్జున్, గురుస్వామి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



అక్టోబర్ 9వ తేదీ గూడూరులోని హజరత్ సయ్యద్ హాషిం హుస్సేనీ జాఫర్ మస్తాన్ ఔలియా వారి దర్గాలో జరిగిన మిలాద్-ఉన్-నబి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, దర్గా కమిటీ అధ్యక్ష గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్‌అహ్మద్, దర్గా సభ్యులు.

# గృహప్రవేశాల లక్ష్యాన్ని పూర్తి చేయాలి



తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు రూపొందించిన జగనన్న కాలనీల సామూహిక గృహప్రవేశాలకు అధికారులు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో 6630 ఇళ్ళు మంజూరయ్యాయని, వాటిలో 351 పూర్తికాగా గోడల స్థాయిలో 378, పైకప్పు స్థాయిలో 292 కలిపి వెరసి మొత్తం 1021 ఇళ్లను డిసెంబర్ 21 నాటికి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంచేసే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

# రూరల్ సీఐగా దశరథరామారావు



గూడూరు రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నెల్లూరు దర్గామిట్టలో విధులు నిర్వహిస్తున్న జి.దశరథ రామారావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఇటీవల ఆయన రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు చిల్లకూరు, గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఆయన గూడూరు ఒకటవ పట్టణ, చిల్లకూరు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా కూడా పనిచేశారు.

# గర్భిణి స్త్రీలకు జెవివి భోజనాలు

తిరుపతి జిల్లా గూడూరు జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గుర్రం విజయ్‌బాబు దాతృత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిరుపేద గర్భిణీ స్త్రీలకు ముఖ్యఅతిథి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారావు చేతులమీదుగా ఇటీవల భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, వాకాటి రామమోహన్, కటకం శ్రీను, విష్ణు, సాయి తదితరులు పాల్గొన్నారు.



# రోటరీ వెస్ట్ క్లబ్‌కు 30 ఏళ్ళు

రోటరీ గూడూరు వెస్ట్ క్లబ్ ఆవిర్భవించి ముప్పై సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆ సంస్థలో ఇరవై ఐదు సంవత్సరాలకుపైగా తమ సేవలందించిన సభ్యులకు స్థానిక రోటరీ భవన్‌లో అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సతీష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొనగా, ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు, నాయుడుపేట రోటరీక్లబ్ సభ్యులు, గూడూరు రోటరీ మెయిన్ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొని సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. ఇరవై ఐదు సంవత్సరాలుపైగా 'సేవే దైవం.. స్నేహమే జీవితం' అంటూ రోటరీ క్లబ్‌లో సేవలందించిన ఎల్లసిరి గోపాల్ రెడ్డి, రామ్మోహన్, పి.ఎం.రావు, శ్రీకాంత్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, రాంప్రసాద్‌లను రోటరీ సభ్యులు సత్కరించుకున్నారు. ఎన్నో వందల సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారాన్ని అందిస్తూ రోటరీ వెస్ట్ క్లబ్ ప్రజలకు చేరువయ్యేందుకు వీరు చేసిన కృషి అమూల్యమని వక్తలు కొనియాడారు. మునిగిరీష్, డాక్టర్ జనార్ధనరెడ్డి, డాక్టర్ రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ సబ్యులు, రోటరీ మెయిన్ క్లబ్ సభ్యులు, రోటరీ గూడూరు వెస్ట్ క్లబ్ సెక్రటరి విజయభాస్కర్‌రెడ్డి, వాసుగౌడ్, సేగు శ్రీనివాస్, నాసిన నాగులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో బ్రాందీ దుకాణమా?

## మహిళల నిరసన



గూడూరు పురపాలక సంఘం పరిధిలోని గాంధీ నగర్ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు యత్నాలు నిలిపివేయాలని ఆ ప్రాంత మహిళలు ఈనెల 10న ఆందోళన చేశారు. గత ప్రభుత్వంలోనూ ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని చూస్తే తాము అభ్యంతరం వ్యక్తం చేయగా తొలగించారని, మళ్ళీ ఇప్పుడు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, దేవాలయం, మసీదు సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే సమస్యలు వస్తాయని వారు నిరసించారు.



## సమాచార హక్కు చట్టాన్ని..
# పటిష్టంగా అమలుచేయాలి
**- కమిషనర్ బివి రమణకుమార్**

జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ బివి రమణ కుమార్ స్పష్టం చేశారు. ఇటీవల నెల్లూరులోని జడ్పీహాల్‌లో ఆ చట్టం అమలుతీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం దరఖాస్తుల పరిశీలనకు, నిర్దిష్ట గడువులోగా పరిష్కారానికి జిల్లా స్థాయి ఆర్టీఐ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు, ప్రభుత్వ కార్యకలాపాల సమాచారాన్ని ఎటువంటి గోప్యత లేకుండా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టం ఏర్పడిందన్నారు. ప్రజాధనంతో చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వివరాలను తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెక్షన్ 4(1బి)లో పొందుపరిచిన 17 అంశాలను తప్పకుండా అమలు చేయాలన్నారు. భూ సంబంధ సమస్యలకు సంబంధించి వస్తున్న ఆర్టీఐ దరఖాస్తులపై రికార్డులు లేవని తప్పించుకోకుండా బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పరిపాలన పారదర్శకత పెరిగిందని, ఎక్కడా గోప్యత లేకుండా స్పష్టమైన సమాచారాన్ని ప్రజలకు అందజేస్తున్నామని ఈ సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు తీరును వివరించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయసేవా సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు, ఏఎస్పీ హిమవతి, డిఆర్‌డిఎ పీడీ సాంబశివారెడ్డి, డిఎంఅండ్‌హెచ్ఓ పెంచలయ్య, డిపిఓ ధనలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రాజు, పంచాయతీరాజ్ ఎస్ఇ శివారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి..
# భక్తుల భారీ కానుకలు
- 32 రోజుల్లో..ఆలయానికి 78.73 లక్షల రాబడి



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికి ఇటీవల శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు వేల సంఖ్యలో తరలిరావడమే కాక, అమ్మవారికి కానుకలు పెద్దఎత్తున సమర్పించుకోవడంతో ఆలయానికి ఈసారి భారీ ఆదాయం వచ్చింది. గత 32 రోజుల్లోనే 78.73 లక్షల రూపాయల రాబడి వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. ఇటీవల దేవస్థానం హుండీలను లెక్కించగా సెప్టెంబరు 5 నుంచ అక్టోబరు 7వ తేది వరకు హుండీ ద్వారా 34.26 లక్షల రూపాయలు వచ్చాయని, టిక్కెట్ల అమ్మకాలు, ఇతర ఆర్జితసేవల ద్వారా 44.47 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. లెక్కింపులో ఆలయ ఇఓ గిరికృష్ణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అళహరి విజయకుమార్, కె.జనార్ధన్‌రెడ్డి, తిరుమలరావు పాల్గొన్నారు.

# పిడిఎఫ్ అభ్యర్థులకు విజయం చేకూర్చండి
**- ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం**



తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పిడిఎఫ్ అభ్యర్థులుగా బాబు రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డిలను ఎంపిక చేయడం జరిగిందని, వారికి విజయం చేకూర్చాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఇప్పటిదాకా తూర్పు రాయలసీమలో పిడిఎఫ్ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారని, ఈసారి కూడా వారిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థులను పరిచయం చేశారు. ప్రజాసంఘాలు, ఉపాధ్యాయులు అందరూ పిడిఎఫ్ అభ్యర్థులకు ఘనవిజయం సాధించిపెట్టాలని ఆయన కోరారు.

# సిఐల బదిలీలు

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు సిఐలను బదిలీచేస్తూ ఇటీవల గుంటూరు రేంజ్ డిఐజి డా. త్రివిక్రమవర్మ ఆదేశాలిచ్చారు. కావలి ఒన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న కాటూరి శ్రీనివాసరావును ప్రకాశం జిల్లా పామూరుకు బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న కొండవీటి శ్రీనివాసరావును కావలిలో నియమించారు. అదేవిధంగా, రేంజ్ కార్యాలయంలో ఉన్న మల్లి నాగేశ్వరరావును ఆత్మకూరుకు, నెల్లూరు దర్గామిట్ట ఇన్స్‌పెక్టర్ జి.దశరధరామారావును గూడూరు రూరల్‌కు బదిలీ చేశారు. అక్కడున్న పి.శ్రీనివాసులురెడ్డిని రేంజ్ కార్యాలయంలో నియమించారు. ఒంగోలు డిటిసిలో ఉన్న సిహెచ్ సీతారామయ్యను నెల్లూరులోని దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన ఆమేరకు దర్గామిట్టలో బాధ్యతలు చేపట్టారు కూడా.

# నగర వనానికి.. 50 లక్షలు మంజూరు

నెల్లూరు సమీపంలో ఆమంచర్ల వద్ద ఉన్న నగర వనానికి రాష్ట్రప్రభుత్వం 50 లక్షల రూపాయలు మంజూరు చేసిందని జిల్లా అటవీ అధికారి ఆవుల చంద్రశేఖర్ తెలిపారు. నగరవనం ఇప్పటికే దాదాపుగా పూర్తయిందని, కొన్నిపనులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన నిధితో ఆ పనులు పూర్తిచేస్తామని, వచ్చే డిసెంబర్ నాటికల్లా నగరవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

# 5 లక్షల మొక్కలు.. పంపిణీకి రెడీ!



ఈ వర్షాకాలంలో అన్ని శాఖల కార్యాలయాలకు పంపిణీ చేసేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు పంపితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజుల్లోనే మొక్కలు పంపిణీ చేస్తామని జిల్లా సామాజిక అటవీ విభాగం అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరులోని తమ కార్యాలయంలో జరిగిన జిల్లా ఫారెస్ట్ కమిటీ సమావేశంలో పలుశాఖల అధికారులతో ఆయన ఈ విషయమై చర్చించారు. ఏఏ శాఖల వారికి ఎన్ని మొక్కలు కావాలో తెలియజేస్తూ ప్రతిపాదనలు ఇవ్వాలని ఆయన కోరారు. నెల్లూరు రేంజ్ అధికారి శివరామకృష్ణ, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో స్మృతి

ఇప్పుడు
ఫోటో ఒక పల్లవి లేని పాటయ్యింది
పందిరి లేని తీగయ్యింది
ఛత్రం లేని చిత్రమయింది
అసంతృప్త చరణాల తోటయ్యింది
ఒకప్పుడు
ఫోటో అంటేనే అపురూప
కార్యక్రమంగా భాసిల్లేది
ఇల్లంతా సందళ్ళ పండుగయ్యేది
తాతా నానమ్మల బోసి నవ్వుల సెలయేరయ్యేది
పిల్లలు రంగు రంగుల సీతాకోక చిలకలై
అలరారే సమయం ఆసన్నమయ్యేది
అదో కుటుంబ నేపథ్యానికి ఎక్స్‌రే సంకేతమయ్యేది
మెడలో కెమెరాతో
సినీ దర్శక వేషధారి ప్రత్యక్షమయ్యేవాడు
ఆ వైభవానికేమి దిష్టి తగిలిందే ఏమోకాని –
జేబుల్లోని సెల్‌ఫోన్లన్నీ ఛాయా
చిత్రాల దడులయ్యాయి
ఆధునికత దుశ్శాసనమై
ఫోటో విలువల వలువలు ఊడ్చేసింది.
స్టూడియో విఫణి మరణించింది
అదో గతం తాలూకు జ్ఞాపకంగా
వీడియో ఆగంతకుల నవ్వుల పువ్వుల్లో
ఓ స్మృతిలా మిగిలిపోయింది!



**చిన్ని నారాయణరావు**
94402 02942

# టూకీగా...



## నర్శింహకొండలో గిరిప్రదక్షిణ ఉత్సవం

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసి ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈనెల 9న పౌర్ణమి తిథి వేడుకలు వైభవంగా జరిగాయి. మూల విరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం, సాయంత్రం స్వామివారికి గరుడసేవ, గిరిప్రదక్షిణ ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఆలయనిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## సిద్ధమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మర్రిపాడు మండలం రాజుపాళెం గ్రామంలో కొలువైవున్న శ్రీ సిద్ధమ్మ అమ్మవారికి ఈనెల 9న ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి వీరమ్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

## పల్లిపాళెంలో ఉచిత వైద్యశిబిరం

సంగం మండలం అన్నారెడ్డిపాళెంలోని పల్లిపాళెంలో ఈనెల 9న బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన బాలాజీక్లినిక్ డాక్టర్ ఎస్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి అనేకమంది రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మారుమూల గ్రామాల్లోని నిరుపేదలకు వైద్యం అందించేందుకు తమవంతు కృషిచేస్తున్నామని ఆయన అన్నారు.

## ఆశావర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

ఆశావర్కర్లకు కనీస వేతనాలివ్వాలని సిఐటియు నాయకుడు కె.హజరత్తయ్య డిమాండ్ చేశారు. ఈనెల9న ఆత్మకూరు సిపిఎం కార్యాలయంలో జరిగిన ఆశావర్కర్స్ యూనియన్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లను రెగ్యులరైజ్ చెయ్యాలని, వారి సమస్యలు తీర్చాలని కోరారు.

## ఉదయగిరిలో పాస్టర్ల దినోత్సవం

ఉదయగిరిలోని బర్డెట్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ఈనెల 9న పాస్టర్ల దినోత్సవం వేడుకగా జరిగింది. అందరికీ మిఠాయిలు పంచి, సంఘ కాపరి రెవరెండ్ పరిమి సుధీర్‌కుమార్ దంపతులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సంఘ కార్యదర్శి బకీర్‌జాషువా, శ్రావణ్‌కుమార్, జోషిబెస్సింగ్టన్, ఏసుదాసులతో పాటు రాబర్ట్ ప్రభాకర్ దంపతులు పాల్గొన్నారు.

## అంకమ్మతల్లి ఆలయానికి విరాళం

కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయానికి దాతలు బెల్లం ఆంజనేయులు, జయమ్మ కుమారుడు వాసుదేవరావు, వారి కుటుంబసభ్యులు 25,672 రూపాయల విరాళంతో పాటు మరో 5,116 రూపాయలను అమ్మవారి పాదాలకు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, మాదాల మాల్యాద్రి తదితరులకు ఆ మొత్తాలను అందజేశారు.

## పేకాటరాయుళ్ళు చిక్కారు

ఆత్మకూరు మండలంలోని బోయళ్ళచిరువెళ్ళ గ్రామంలో సైగ్గా పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్ఐ శివశంకరరావు ఈనెల9న అదుపులోకి తీసుకుని, వారినుంచి 3110 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్ళు తమ ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు.

## ఉద్యోగుల బాధలు పట్టించుకోండి

ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల బాధలను ప్రభుత్వం పట్టించుకోవాలని, వారికి రావాల్సిన కరువుభత్యం, పిఆర్‌సి, పిఎఫ్ రుణాల బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగులకు సకాలంలో నెలవారీ జీతాలు, పెన్షన్లు మంజూరు చేయాలని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.తిరుమలయ్య ఇటీవల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వాత్సల్య చిన్నారులకు సాయం

నెల్లూరులోని లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రతిభ, లియో క్లబ్ ఆఫ్ ప్రతిభ వారు ఇటీవల భక్తవత్సలనగర్‌లోని వాత్సల్య అనాథ శరణాలయం విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, సబ్బులు వగైరా సామగ్రిని వితరణగా అందజేశారు. క్లబ్ సర్వీసెస్ ఛైర్మెన్ సతీష్‌కుమార్, అధ్యక్షుడు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



## గౌరవపూర్వక కలయిక

అక్టోబర్ 9వ తేదీ ఆదివారం చెన్నైలోని రాజ్‌భవన్‌లో భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును గౌరవపూర్వకంగా కలసి అభినందిస్తున్న గూడూరు వాసి, సుప్రసిద్ధ కాంట్రాక్టర్ కనుమూరు హరిచంద్రారెడ్డి.

## 'శివభారతము'పై నరాల రామారెడ్డి ఉపన్యాసం 16న

ప్రఖ్యాత కవి గడియారం వేంకటశేషశాస్త్రి రచించిన 'శివభారతము' (ఛత్రపతి శివాజీ)పై పొద్దుటూరుకు చెందిన ప్రముఖ అవధాని డా. నరాల రామారెడ్డి ఉపన్యసిస్తారని, ఈనెల 16వ తేది సాయంత్రం జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటయ్యే సభకు బిజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి అధ్యక్షత వహిస్తారని, డా. కరిమద్దెల నరసింహారెడ్డి సభను నిర్వహిస్తారని, అవధాని కోట రాజశేఖర్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తొలుత డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కవిసమ్మేళనం ఉంటుందని తెలిపారు.

## దర్గామిట్ట సిఐగా..సీతారామయ్య



నెల్లూరులోని దర్గామిట్ట పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా సిహెచ్ సీతారామయ్య ఇటీవల బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఆయన, 2002 బ్యాచ్‌లో ఎస్ఐగా ఉండి, గతంలో నెల్లూరు జిల్లాలోని పలు స్టేషన్ల లోనూ ఎస్ఐగా, సిఐగా విధులు నిర్వహించారు. ఒంగోలు పిటిసి ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న సీతారామయ్యను నెల్లూరు దర్గామిట్ట ఇన్స్‌పెక్టర్‌గా ఇటీవలే బదిలీ చేశారు. ఎక్కడ పని చేసినా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ, రాజీలేని అధికారిగా ఆయన మంచిపేరు తెచ్చుకున్నారు.

## నెల్లూరు ఆర్టీసికి..47 లక్షల ఆదాయం

దసరా పండుగ సందర్భంగా ప్రయాణీకుల కోసం ప్రత్యేక బస్సులు నడపడంతో నెల్లూరు ఆర్టీసికి దాదాపు 47 లక్షల రూపాయల దాకా ఆదాయం వచ్చింది. మొత్తం 157 బస్సుల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆర్టీసి వర్గాలు పేర్కొంటున్నాయి.

# రాజకీయాల పడగలో రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలలో 175 సీట్లకు గాను కేవలం 23 సీట్లకు పరిమితమై పోయాడు. అసంబ్లీలో తనకు పరాభవం జరిగిందంటూ మీడియా ముందు భోరున విలపించి ఇప్పుడు అంతకంటే ఘోరాతి ఘోరమైన అవమానాలను ఎదుర్కొంటున్నాడు...!

2019 తరువాత రాజశేఖరరెడ్డి వారసుడిగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాడు. తానుకూడా కలలో సైతం ఊహించని సీట్లిచ్చి ఆంధ్రులు జగన్‌ని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెట్టారు. ఒక్క అవకాశం ఇవ్వండి అని తన పాదయాత్రలో పదేపదే అభ్యర్థించిన జగన్ కోరికను జనం తీర్చారు. 30 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఆంధ్రను ఏలాలన్నది ఆయన లక్ష్యం. ఆయన సీఎం అయిన మూడున్నరేళ్ల కాలంలో తాను ఇచ్చిన మాటకు కట్టుబడ్డాడు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన నవరత్నాలను 90శాతం అమలుచేయడంలో సఫలమయ్యాడు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రెండులక్షల కోట్లకుపైగా ఇప్పటికే ప్రజల ఖాతాలలో నేరుగా జమ చేశాడు. నాడు – నేడు పేరుతో విద్యాలయాలకు, వైద్యాలయాలకు కొత్త సొబగులు దిద్దాడు. 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించాడు. తన పాదయాత్రలో ఇచ్చిన హామీలే కాకుండా చెప్పనివి కూడా చాలానే చేశాడు. వీటితో పాటు జగన్ కొన్ని రాజకీయ నిర్ణయాలు కూడా చేశాడు. వచ్చీ రాగానే ప్రజావేదిక కూల్చేశాడు. చంద్రబాబుని అసెంబ్లీలో కాలుపెట్టకుండా చేశాడు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్ద పీట వేశాడు. మంత్రివర్గంలో, నామినేటెడ్ పదవులలో మహిళలకు ప్రాధాన్యత కల్పించాడు. శాసనసభలో మూడు రాజధానుల ప్రకటన చేశాడు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్చాడు. ఇలా చెప్పుకుంటూ పోతే... ఇన్ని సంచలనాత్మక నిర్ణయాలను ఈ మూడున్నరేళ్ళ కాలంలో తీసుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే.

**ఇదీ జరిగిన కథ..!**

**ఇక జరుగుతున్న కథలోకి వెళ్తే...**

మిగిలిన అన్ని విషయాలకన్నా ప్రధానమైన అంశంగా పాలనా వికేంద్రీకరణ కనిపిస్తుంది. అమరావతే రాజధానిగా కావాలని ఆ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. ఖచ్చితంగా విశాఖ పాలనా రాజధానిగా మూడు రాజధానులు రావాల్సిందే అని అధికార పార్టీ పట్టుపట్టింది. ఇక్కడ రాష్ట్రంలోని మిగతా ప్రాంత ప్రజల మనోభీష్టం ఏమిటన్నది ప్రశ్నార్థకమే. ఎందుకంటే ఒక్క రాయలసీమలో కొంత భాగం నుండి తప్ప ఈ విషయంలో ఎవరు పెద్దగా నోరు మెదపడంలేదు. వైసీపీ తప్ప మిగిలిన అన్ని పక్షాలూ అమరావతే రాజధాని అంటూ ముక్తకంఠంతో నినదిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఇప్పుడు మూడు రాజధానుల వ్యవహారం ప్రాంతీయ విభేదాలకు ఆజ్యం పోస్తుందేమో అన్న సందేహాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తపరుస్తున్నారు. అమరావతి రైతులు గతంలో తిరుపతి దాకా చేసిన పాదయాత్రకు ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. ఇప్పుడు అదే రైతులు అమరావతి నుండి అరసవెల్లి దాకా చేపట్టిన మహా పాదయాత్ర వివాదాలకు తెర లేపింది. మా ప్రాంతంలో రాజధాని వస్తే వద్దనడానికి మీరెవరు అంటూ ఉత్తరాంధ్ర నాయకులు గళమెత్తారు. వీరిలో ఎక్కువ శాతం వైసీపీ వర్గానికి చెందినవారే కావడం విశేషం. నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి) పేరుతో ఒక బృందం కూడా ఏర్పాటయింది. అక్టోబర్ 8వ తేదీన ఈ బృందం సమావేశమై భవిష్యత్ కార్యచరణ ప్రకటించారు. కొంతమంది శాసనసభ్యులు ఒకడుగు ముందుకేసి రాజీనామాలకు కూడా సిద్ధమయ్యారు. అమరావతి రైతుల పాదయాత్రను అడ్డుకుంటామని, అవసరమైతే రక్తం చిందిస్తామని శపథం కూడా చేశారు. మా ప్రాంతం అభివృద్ధిని అడ్డుకుంటాం అంటూ మీరు పాదయాత్రలు చేస్తే మేమెలా చూస్తూ ఊరుకుంటాం...? అని ప్రశ్నించారు. మొండిగా అడుగులు ముందుకు వేస్తే రక్తపాతం తప్పదన్న సంకేతాలు కూడా ఇచ్చారు.

ఇదే సమయంలో భాజపా నాయకుడు టీజీ వెంకటేష్ తన నిరసన స్వరం వినిపించాడు. 'రాయలసీమకు అన్యాయం జరిగితే ఒప్పుకోం' అంటూ హెచ్చరిక జారీచేశాడు.

ఇప్పుడు ప్రభుత్వంపై అక్కడక్కడా ప్రజలలో ఉన్న అసంతృప్తి వ్యవహారం అటకెక్కింది, ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్ల సమస్యల గురించి పట్టించుకునేవారెవరూ లేరు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు విషయం జనం మర్చిపోయారు, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనల సంగతి ఎవరికీ అవసరంలేదు, రైతుల కరెంటుకి మీటర్లు, పెరిగిన కరెంటు ఛార్జీలు, ఆకాశాన్ని తాకుతున్న ఇళ్ల పన్ను, క్షీణించిన శాంతి భద్రతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల్లో వస్తున్న తీర్పులు... ఇంకా ఇలాంటి అనేక విషయాలను గురించి ఆలోచించే టైమే ఎవరికీ లేదు. ఎందుకంటే... రాష్ట్ర రాజకీయమంతా రాజధాని చుట్టూ తిరుగుతోంది.

అమరావతి రైతుల పాదయాత్ర ముగిసేలోపల ఏం జరగబోతోంది..? రాజీ ఫార్ములా ఆలోచిస్తారా లేక రాజకీయ అస్త్రాలు ప్రయోగిస్తారా...? ఇప్పుడు అందరి దృష్టి ఈ అంశంపైనే. అటు అమరావతి రైతులు, అన్ని ప్రతిపక్ష పార్టీలు ఒకవైపు... ఇటు ప్రభుత్వం ఒక్కటే మరోవైపు. ఎవరికి వారు తగ్గేదేలే! అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ వికేంద్రీకరణ ఎక్కడ ప్రాంతీయ విద్వేషాలను రగిలిస్తుందో అని విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు. ప్రాంతీయ విభేదాలతో విద్వేషాలు చెలరేగి రాష్ట్ర భవిష్యత్తును కాటు వేయకముందే రాజకీయాల పడగ నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని తటస్థ జనం కోరుకుంటున్నారు.

## విజయసాయి

(మొదటి పేజీ తరువాయి)

దిట్టగా ఇప్పటికే విజయసాయిరెడ్డిని పేర్కొంటారు వైసీపీ శ్రేణులు. ఇప్పుడు ఆయన చెప్పినట్లుగా టీవీ ఛానల్‌తో పాటుగా, ఒక పత్రిక కూడా ప్రారంభిస్తే ఆయనకు తిరుగే ఉండదన్నది వారి జోస్యం. లెక్కల మాంత్రికుడిగా ఉండి రాజకీయ తాంత్రికుడిగా అవతరించిన విజయసాయిరెడ్డి మీడియాలో కూడా ప్రవేశిస్తే ఆయన ముందు ఎంతటి ఛానలైనా, పత్రికైనా, తట్టుకోవడం కష్టమే అంటున్నారు ఆయన గురించి బాగా తెలిసినవారు. చూద్దాం... ఏం జరగబోతోందో...!

# భారీ కుంభకోణం!

(3వ పేజీ తరువాయి)

డబ్బునంతా తినేశారు. హమాలీలకు ఇవ్వాల్సిన కూలిడబ్బులనంతా తాగేశారు. అందులోనూ తాను మొదట హమాలీయే అయినా, హమాలీలకు ఇవ్వాల్సిన కోట్లాది రూపాయల రవాణా ఛార్జీలను కూడా స్వాహా చేశాడంటే ఏమనుకోవాలి?.. గోడౌన్లకు చెల్లించాల్సిన అద్దె డబ్బులు లాగేశాడు. ఇలా ఒక ప్రభుత్వ సంస్థలో ప్రజాధనాన్ని దారిమళ్ళించి అక్రమంగా కోట్లాది రూపాయలు దోచుకోవడమన్నది జిల్లా చరిత్రలోనే కనీవినీ ఎరుగని కుంభకోణం. ఇందులో సుమారు 23 కోట్ల రూపాయల దాకా చెక్కుల రూపంలోనే డ్రా చేశారని, మిగిలిన మొత్తమంతా ఆన్‌లైన్‌లో జమ అయిందని..ఉన్నతాధికారులు గుర్తించారు. ఇదంతా ఏ ఒక్కరితోనో అయ్యేపని కాదు. అన్ని దశల్లో అందరూ సహకరించకపోతే ఇంత డబ్బు తినడం ఎలా సాధ్యమని అధికారులు అనుమానిస్తూ..విచారణను మరింత లోతుగా చేస్తున్నారు.

**ఇంకా ఎంత తిన్నారో.. ఎంతమంది ఉన్నారో?...**

అవినీతిలో ఇంతపెద్ద కుంభకోణంలో ఇంకా అనేకమంది ఉండి ఉండవచ్చని, అవినీతిలో తలపండిన పెద్దతలకాయలెవరో దీన్నంతా నడిపించి ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు అనుమానిస్తూ ఆ దిశగా కూడా దృష్టి సారించారు. ఇన్నేళ్ళుగా ఈ స్వాహాయణం జరుగుతున్నా ఎవరూ ఎందుకు పట్టించుకోలేదనే 'రహస్యాన్ని' ఛేదించడానికి అనువైన ఆధారాలన్నీ సేకరిస్తున్నారు. ఆ చిరుద్యోగి చేరినప్పటినుంచి ఇప్పటిదాకా ఎవరెవరు సహకరించారో, ఎవరి కెంత ఇచ్చాడో.. ఎవరెవరితో లావాదేవీలు జరిగాయో..ఎంత కుంభకోణం జరిగిందో అన్ని కోణాల నుంచి ఆ వివరాలన్నీ రాబడుతున్నారు. 2007 నుంచి ఎవరెవరు అధికారులున్నారు, ఎంతెంత అక్రమ ఆస్తులు సంపాదించారు?.. ఎలా సంపాదించారు?.. ఇంకా ఎవరెవరు ఈ కుంభకోణంలో ఉన్నారనే విషయాలన్నీ ఆరా తీస్తున్నారు.

## నాటి హమాలీ.. నేడు కుబేరుడు!

ఒకప్పుడు హమాలీగా సివిల్ సప్లయిస్ సంస్థలో ఉద్యోగంలో చేరిన ఆ చిన్న ఉద్యోగి ఆ అవినీతిడబ్బుతో ఇప్పుడు ఒక్కసారిగా కుబేరుడైపోయాడు. హాయిగా కార్యాలయంలో కూర్చుని కోట్లు స్వాహా చేస్తూ కార్లు, బార్లు కొన్నాడు. విల్లాలు..జల్సాలకు ఇక లెక్కే లేదు. కోవూరులో ఒక బిల్డింగ్ కట్టాడు. నెల్లూరులోని ధనలక్ష్మీపురంలో మరో డూప్లెక్స్ భవనం కడుతున్నాడు. చేతిలో ఉన్న ఫోన్ ఖరీదే లక్షా 80 వేల దాకా ఉంటుందంటే..చూడండి ఎన్ని కోట్లు జనం డబ్బు జుర్రేశాడో! ఆ అక్రమాస్తులను చూసి ఉన్నతాధికారులే 'అమ్మ బాబోయ్'..అంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఏళ్ళతరబడిగా ఇంత పెద్దఎత్తున.. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఎగరేసుకుపోతున్నా సంబంధిత సంస్థ అధికారులెవరూ ఎందుకు పట్టించుకోలేదో...అందులో లోగుట్టు ఏమిటో నని..పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. కేవలం రెండున్నరేళ్ళలోనే ఈ అవినీతి జరిగినట్లు ఆడిట్‌లో తేలడంతో, అంతకు ముందు నుంచి కూడా..అంటే ఆ చిరుద్యోగి ఉద్యోగంలో చేరిన 2007 నుంచి ఇంకెంత భారీగా స్వాహాలు జరిగిపోయి ఉంటాయోనని అధికారులు పాతలెక్కలన్నీ తీస్తున్నారు. మూడేళ్ళక్రితం సివిల్ సప్లయిస్ సంస్థలో రికార్డులు తగలబడటం వెనుక కూడా ఇదే అవినీతిపరుల హస్తం ఉంటుందని కూడా భావిస్తున్నారు. ఈ అక్రమాల బాగోతం వెనుక ఇంకా ఎందరు అధికారులు, ఉద్యోగుల హస్తముందో అణువణువూ ఆరా తీస్తున్నారు. అక్రమార్కుల భరతం పట్టేందుకు అన్నివిధాలా వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే అయిదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. ఈ కుంభకోణానికి పాల్పడిన వారిని, అందుకు సంబంధించిన వారిని, సహకరించిన వారినందరినీ గుర్తించి.. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినచర్యలు తీసుకోవాలని.. అక్రమార్కుల ఆస్తులు జప్తుచేసి..వారు తిన్న డబ్బునంతా పైసాలతో సహ కక్కించాలని ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ స్వాహాపర్వం.. ఒక్క నెల్లూరులోనే ఇలా జరిగిందా?.. ఈ అక్రమార్కుల ద్వారా ఇతర జిల్లాలకు వ్యాపించిందా?.. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న సివిల్ సప్లయిస్ సంస్థల్లో కూడా ఇలాంటి అవినీతిపనులు, కుంభకోణాలేమైనా జరుగుతున్నాయా?..అని కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూపీ లాగుతున్నట్లు సమాచారం.



# రాజకీయ భేతాళం!

అదో పెద్ద.. ఊడలు భూమిలోకి బాగా దిగిన మహా మర్రిచెట్టు. దానికి ప్రజాస్వామ్యం అని ఓ ముద్దు పేరు కూడా ఉంది. భూతాలకు, ప్రేతాలకు, పిశాచాలకు నిలయంగా మారిపోయింది. ఇప్పుడే కాదు. ఓ డెబ్బయ్ అయిదేళ్ల నుంచి అక్కడే ఆ మర్రిచెట్టు మీదే అవి వేళ్ళాడుతూ…. కాపురాలు చేసుకుంటూ.., పిల్లల్ని కంటూ, చెట్టు ముందు నుంచి వస్తూ, పోతూ ఉండే వారిని పలకరిస్తూ… హాయిగా కాలక్షేపం చేస్తుంటాయి . పిల్ల భూతాలు, పిల్ల పిశాచాలు కూడా ఆ చెట్టుమీదే పుట్టి, అక్కడే ఆడుతూ… పాడుతూ పెరిగి పెద్దైపోతాయి. ముసలి భూతాలు దేవుడి దగ్గరి నుంచి పిలుపు రాగానే కాలం చేస్తుంటాయ్. ఆ మర్రి చెట్టు అంటే వాటికి అంత ఇష్టం.

దాని కొమ్మల్లో ఒక దాని మీద తల్లకిందులుగా ఓ వెరైటీ పిశాచం వేలాడుతూ ఉంటుంది. దానికి చావు పుట్టుకలు ఉండవ్. దాని ముద్దు పేరు 'రాజకీయ అరాచకం'.

మిగిలిన భూతాలు దీనిని ప్రేమతో 'భేతాళుడు' అని పిలుస్తుంటాయి. వాటికి కూడా ఇదంటే చాలా ఇష్టం.

ఈ శవం బాగా తెలివైనది. తనకు సమీపంగా వచ్చిన వారిని చూసి ప్రేమగా నవ్వుతూ పలకరిస్తుంది. రెండు చేతులూ బాగా పైకెత్తి, తిరుపతి వెంకన్నకు క్యూలలో ఉన్నవారు దణ్ణం పెట్టినట్టు పెడుతుంది. దొరికితే మాత్రం… ఆవకాయ పచ్చడిని నాకినట్టు నాకేస్తుంది .

ఈ భేతాళుడి బారిని పడకుండా… బతకడం జనానికి కుదరడం లేదు. ఎప్పుడు, ఏ కోణంలో, ఎవరిని నంజుకు తింటుందో జనానికి తెలియదు.

ఎలాగైనా ఈ భేతాళుడిని 'బ్యాలెట్ బాక్స్'లో బంధించి, సీల్‌వేసి, బంగాళా ఖాతంలో వేసేయాలని కృతనిశ్చయానికి వచ్చిన ఓ ఓటరు విక్రమార్కుడి రూపంలో ఊడల మర్రి వద్దకు వచ్చాడు. దయ్యాలు, పిశాచాలు, భూతాలతో ఊడల మర్రి కిటకిటలాడుతోంది

తనను పట్టుకోడానికే విక్రమార్కుడు వచ్చాడని గమనించిన భేతాళ శవం, ఓ చిరునవ్వు నవ్వుకున్నది. ఓటర్ల చేతిలో గానీ, పోలీసుల చేతిలో గానీ, ప్రభుత్వాల చేతిలో గానీ, ఎన్నికల సంఘం చేతిలో గానీ, రాజ్యాంగం చేతిలో గానీ తనకు మరణం లేదని బ్రహ్మదేవుడు వరం ఇచ్చిన విషయం ఈ విక్రమార్కుడికి తెలియదు.

మొత్తం మీద వెదికి, వెదికి చెట్టు మీదున్న భేతాళ శవాన్ని విక్రమార్కుడు ఒడిసి పట్టుకుని, భుజం మీద వేసుకుని, స్మశానం దగ్గర ఉన్న పోలింగ్ బూత్ వైపు మౌనంగా నడక మొదలు పెట్టాడు. మధ్యలో ఏమాత్రం మాట్లాడినా, అది మళ్ళీ ఎగిరిపోయి, ప్రజాస్వామ్య మర్రిచెట్టు మీద తల్లకిందులుగా వేళ్ళాడుతుందని తెలుసు.

విక్రమార్కుడి పట్టుదల చూసి, భేతాళుడికి మా చెడ్డ ముచ్చటేసింది.

'రాజా! పోలింగ్ బూత్ చాలా దూరం ఉంది. రోడ్డు అంతా గుంతలు, గతుకులు. మొన్నీమధ్య గతుకుల్లో బళ్ళ మీద నుంచి పడి, ఇద్దరు ముగ్గురు పోయారు. వళ్ళు దగ్గర పెట్టుకుని నడవకపోతే నువ్వు కూడా బోర్లా పడతావు. నీకు శ్రమ తెలియకుండా నడవడానికి వీలుగా ఓ కథ చెబుతాను, విను " అన్నది. విక్రమార్కుడు మౌనం వీడకుండానే నడక సాగిస్తున్నాడు.

శవం మొదలు పెట్టింది.

"మునుగోడు అని ఒక నియోజక వర్గం ఉంది, తెల్సుకదా!అక్కడి నుంచి ఇప్పుడు అసెంబ్లీకి ఓ ఉప ఎన్నిక వచ్చి పడింది. ప్రజాస్వామ్యం అంటే పడి చచ్చిపోయే మూడు నీతివంతమైన పార్టీలు అక్కడ పోటీ పడుతున్నాయ్.




అక్కడ గెలిచే వారు ఓ ఏడాది కంటే ఎక్కువ కాలం పదవిలో ఉండరు. మళ్ళీ వచ్చే ఏడాది ఎన్నికలే. ఈలోపు సంపాయించుకునే ఛాన్స్‌లు పెద్దగా ఉండవ్. అయినా సరే, ఇంటికి యాభై వేలు… కాదంటే తులం బంగారం… ఓట్లు వేయించినోడికి మోటార్ సైకిల్…..,గల్లీ లీడర్లకు కార్లు ఇస్తారని పేపర్లలో రాస్తున్నారు… చూశావా?" అన్నది భేతాళ శవం.

విక్రమార్కుడు మౌనంగా వింటూ నడుస్తున్నాడు. ఏమీ అనలేదు.

భేతాళుడు మళ్ళీ మొదలు పెట్టాడు.

"… ఇప్పుడు ఈ ముచ్చట ఎందుకని అనుకుంటున్నావేమో! సంవత్సరం కూడా ఉండని పదవి కోసం…. సంపాదించుకునేంత టైం కూడా లేని పదవి కోసం ఇంటికి యాభై వేలు, అరవై వేలు ఇస్తానికి పార్టీలు రెడీ అయిపోతుంటే…. మీకు ఎంతెంత ఇవ్వాలి అనేది నా పాయింట్!"అన్నాడు భేతాళుడు. విక్రమార్కుడు నోరెత్తలేదు.

ఓ నిముషం గాలి పీల్చుకుని, మళ్ళీ మొదలు పెట్టాడు, భేతాళుడు.

"…. ఎన్నికల్లో గెలిచినోళ్ళు దోచుకోవాలి అని అనుకుంటే… అయిదేళ్ల పాటు దోచుకునే ఛాన్స్ ఉంటుంది కదా! ఇసక బొక్కేయవచ్చు కదా! నచ్చిన భూమి కబ్జా చేసి ప్లాట్లు వేసి, విల్లాలు విల్లాలుగా అమ్మేయించు కోవచ్చు కదా! కుదిరితే కాంట్రాక్ట్‌లు, కుదరకపోతే కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లు కొట్టేయవచ్చుకదా! పోలీసుల్ని అడ్డం పెట్టుకుని సెటిల్మెంట్లు, కలెక్షన్లు చేయించుకోవచ్చు కదా! చెరువుల దగ్గరా, పొలం గట్ల మీదా పేకాట క్లబ్‌లు నడిపించుకోవచ్చు కదా! ఎక్కడ బడితే అక్కడ మట్టినీ, కొండల్నీ తవ్వించేసుకోవచ్చు కదా! వీటిల్లో దేనికి అడ్డం వచ్చినోళ్ళనైనా లేపించేసే వెసులుబాటు కూడా ఉంటుంది కదా!

మీ దగ్గర గెలిచినోళ్లకు ఇన్ని పెసిలిటీసు ఉన్నప్పుడు…. మునుగోడు రేటు కంటే డబల్ అయినా ఉండొద్దా అనేది నా పాయింట్… ఏమంటావ్ విక్రమార్కా?" అని భేతాళుడు ఓ క్షణం ఆగాడు.

విక్రమార్కుడు ఏమీ అనలేదు. గుంటలు, గోతులూ తప్పించుకుంటూ మౌనంగా నడుస్తున్నాడు.

భేతాళుడు మళ్ళీ మొదలు పెట్టాడు.

"….. వాళ్ళు ఎంతిచ్చినా మీకు మట్టుకు గిట్టేది ఏముందిలే ? అన్నీ రేట్లు పెరిగిపోయాయా? పెట్రోలు రేటు పెరిగిందా? సారా… బ్రాందీ రేటు పెరిగిందా? లంచాల రేట్లు పెరిగాయా? సెటిల్మెంట్ రేట్లు పెరిగాయా? ఎంఆర్ఓ ఆఫీస్ రేట్లు పెరిగాయా? కూరగాయల రేట్లు పెరిగాయా? నూనెల రేట్లు పెరిగాయా? చెత్త పన్ను, ఇంటి పన్ను రేట్లు పెరిగాయా? చాపలు, మాంసం రేట్లు పెరిగాయా? కరెంటు రేట్లు పెరిగాయా? వేళ్ళ గోళ్లు…. శరీరం మీది వెంట్రుకలు పెరుగుతున్నట్టు ఇవన్నీ మీకు తెలవకుండానే పెరుగుతున్నాయి కదా! గెలిచినోళ్లు మళ్ళీ అయిదేళ్ళ మీ ముఖం చూడరు కదా! అందుకని ఇంటికి లక్ష ఇచ్చినా మీకు వర్క్ ఔట్ కాదన్నది నా ఫీలింగు. ఏమంటావ్ రాజా…." అని భేతాళుడు ఆగాడు.

భేతాళుడు చెబుతున్న దాంట్లో విక్రమార్కుడికి కొంత లాజిక్ ఉన్నదని పించింది. అయితే, ఓ సందేహం తన్నుకొచ్చింది. ఆపుకుందామనుకున్నా ఆగలేకపోయాడు.

" భేతాళా… నువ్వు చెప్పింది పద్దతిగానే ఉంది గానీ… నాకో సందేహం…!?" అన్నాడు.

విక్రమార్కుడుతో చివరకు మాట్లాడించినందుకు భేతాళుడికి సంతోషం వేసింది.

"చెప్పు రాజా…చెప్పు " అన్నాడు.

" వైసీపీ వాళ్ళతో పేచీ లేదు కానీ చంద్రబాబు నాయుడు, లోకేష అదే పనిగా స్పీచ్‌లు మీద స్పీచ్‌లు ఇచ్చి, ఫ్రీగా ఓట్లు వేయమంటారేమో అని భయంగా ఉంది…." అన్నాడు, విక్రమార్కుడు.

విక్రమార్కుడికి మౌన భంగం కావడంతో, శవంలో ఉన్న 'రాజకీయ అరాచకం' అనే భేతాళుడు శవంతో సహా రివ్వుమంటూ ప్రజాస్వామ్యం మర్రిచెట్టు వైపుకు దూసుకుపోయాడు.

**- భోగాది వేంకట రాయుడు**

---

## పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు చేయూత

నెల్లూరులోని శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వబ్రాహ్మణ విద్యానిధి సమావేశం ఇటీవల ఆ సంస్థ కోశాధికారి తొగరుచీటి కొండాచారి అధ్యక్షతన జరిగింది. 2022–23 విద్యా సంవత్సరానికి 51 మంది పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు (ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంసిఏ, ఎంబిఏ, ఎమ్మెస్సీ చదువుతున్నవారికి) ప్రోత్సాహకంగా 76 వేల రూపాయలను ఈ సమావేశంలో సంస్థ అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అందుకు పలువురు దాతలు ఆర్థికంగా సహకరించారని కూడా పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి దయానంద, దేవరాయపల్లె నాగార్జునాచారి, ఆలూరు కరుణాకర్, నారాయణరావు, బి. వెంకటశ్రీనివాసరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పోలూరి వారి రచనలు ఆణిముత్యాలు

### జయంతి సభలో కొనియాడిన వక్తలు



ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, బహుగ్రంథకర్త బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ 98వ జయంతి కార్యక్రమం కోవూరు సమీపంలోని ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమంలో ఈనెల 10న జరిగింది. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరిస్వామి సభకు అధ్యక్షత వహించగా, పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పోలూరి వారి ధర్మనిరతిని, సనాతన ధర్మ పరిరక్షణకు వారు చేసిన రచనలను ప్రస్తుతిస్తూ ప్రసంగించారు. 'శ్రీ రామాయణ తరంగిణి', 'శ్రీ వాసుదేవ కథాసుధ' వంటి పోలూరి వారి రచనలు ఆధ్యాత్మికరంగంలో ఆణిముత్యాల వంటివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సారస్వతవేత్తలు వేదం రాధాకృష్ణమూర్తి, డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, పోలవరం లక్ష్మీనరసింహారావుతో పాటు పోలూరి హనుమజ్జానకీరామశర్మ కుమార్తె బద్దెపూడి మీనాక్షి, ఆమె కుమారుడు కుమారశర్మ తదితరులు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రాలకు.. ఆర్టీసి ప్రత్యేక బస్సులు

అరుణాచల క్షేత్రాన్ని సందర్శించుకునే భక్తుల సౌకర్యార్థం నెల్లూరు -2వ డిపో నుంచి ఇటీవల ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశామని, అందుకు ప్రయాణీకుల నుంచి మంచి ఆదరణ రావడంతో మరో రెండు బస్సులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్టీసి డెప్యూటి సిటిఎం చిరంజీవి చెప్పారు. కార్తీకమాసం వస్తుండడంతో ప్రతి ఆదివారం కూడా అరుణాచలం క్షేత్రానికి ఒక బస్సును, పౌర్ణమికి ఏర్పాటుచేసిన బస్సులతో పాటు అరుణాచలానికి ప్రత్యేక ప్యాకేజీ టూర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్యాకేజీ టూర్‌లో తిరుత్తణి, కంచి, అరుణాచలం, కాణిపాకం ఆలయాలను కూడా దర్శించుకోవచ్చన్నారు. అదేవిధంగా, అహోబిలం, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు మరో ప్రత్యేక ప్యాకేజీ ఉంటుందన్నారు. శబరిమలైకి వెళ్లే భక్తుల కోసం కూడా త్వరలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

## గుట్కా స్మగ్లర్ల.. ఆట కట్టయింది

- 'పుష్ప' సినిమాను తలపించారు.. దొరికిపోయారు
- 10 లక్షల సరుకు స్వాధీనం-ముగ్గురు అరెస్ట్



గుట్కాల స్మగ్లింగ్‌లో ఆరితేరిన ముగ్గురు..ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయారు. 'పుష్ప' సినిమాలో లాగా ప్రత్యేకంగా వాహనంలో రహస్య గదిని కూడా ఏర్పాటుచేసుకుని, అందులోని అరల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులను ఉంచి, వాటిని భారీగా అక్రమరవాణా చేస్తున్న ఆ ముగ్గురినీ సెబ్ పోలీసులు ఇటీవల చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు 10 లక్షల రూపాయల విలువచేసే గుట్కాలతో పాటు, వాటి రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని జిల్లా సెబ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ ఆ ముఠా అక్రమాలను వివరించారు. కనిగిరి ప్రాంతానికి చెందిన గంగిరెడ్డి దుర్గారెడ్డి, కందుకూరుకు చెందిన పులిచెరి రుతువర్ధన్, మునగాటి సాయిపవన్ కల్యాణ్‌లు ఒక ముఠాగా ఏర్పడి వీటిని అక్రమరవాణా చేస్తున్నారని, నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టెపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గుట్కాల బండారం బయటపడిందని ఆయన తెలిపారు. కర్నాటక నుంచి గుట్కాలు తీసుకువెళ్ళి కనిగిరికి తీసుకువెళ్ళి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని, మధ్యలో ఎవరికీ అనుమానం రాకుండా వాహనం క్యాబిన్ లోపల ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అరల్లో వీటిని దాచి అక్రమ రవాణాచేస్తున్నారని తెలిపారు. వాహనంలో ఉన్న 39,700 గుట్కాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నెల్లూరు రూరల్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. సెబ్ ఏఇఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ కెపి కిశోర్, సెబ్ జేడీ టీమ్ ఇన్స్‌పెక్టర్ హుస్సేన్‌బాషా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



# జిఎస్ఎల్వి మార్క్-3 రెడీ

## 21న.. ఒకేసారి 36 ఉపగ్రహాలతో నింగిలోకి...

***శ్రీహరికోటలోని సతీష్ధవన్ స్పేస్ సెంటర్ నుంచి అక్టోబర్ 21న మరో రాకెట్ ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు సమాయత్తమవుతున్నారు. ఒకేసారి 36 ఉపగ్రహాలతో వాణిజ్యపరమైన జిఎస్ఎల్వి మార్క్-3 భారీ రాకెట్ను రోదసిలోకి పంపుతున్నారు.***

తిరుపతి జిల్లా శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి అక్టోబర్ 21న భారీ రాకెట్ ప్రయోగం జరగనుంది. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోజు అర్ధరాత్రి 12 గంటలా 2 నిమిషాలకు షార్లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈ రాకెట్ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. యూకె (యునైటెడ్ కింగ్డం)కు చెందిన నెట్వర్క్ యాక్సెస్ అసోసియేషన్ లిమిటెడ్ (వన్ వెబ్ కంపెనీ)తో ఇస్రో, న్యూ స్పేస్ ఇండియా, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ సంస్థలు ఆ ప్రయోగాన్ని నిర్వహించేందుకు ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్నాయి కూడా. ఇందులో భాగంగా వన్ వెబ్కి చెందిన 36 ఉపగ్రహాలను ఒకేసారి లోయర్ ఎర్త్ ఆర్బిట్ (లియో ఆర్బిట్) రోదశిలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ రాకెట్ ద్వారా రోదసిలోకి ప్రయోగించే 36 ఉపగ్రహాలు 4,932 కిలోల బరువుంటాయని, ఫ్యూయల్ వగైరాలన్నీ కలిపితే దాదాపు 5.21 టన్నుల బరువుంటుందని ఇస్రో వర్గాలు పేర్కొంటున్నాయి. జిఎస్ఎల్వి మార్క్-3 భారీ రాకెట్ కనుక, దీనిని వాణిజ్యపరంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉండడంతో ఈ ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. వన్ వెబ్ కంపెనీ గ్లోబల్ కమ్యూనికేషన్ నెట్వర్క్ వాణిజ్యపరంగా ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు ఇస్రోతో కలసి ఈ ప్రయోగం చేపడుతుండడం విశేషం.

# కొత్త ఎంవీఐకి..శ్రీసిటీ ఎం.డి అభినందనలు




శ్రీసిటీ పరిసరాల్లో ఉన్న ప్రజల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ శ్రీసిటీలో ఎంవీఐ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఎంవిఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పుత్తూరు నూతన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, శ్రీసిటీ క్యాంపు కార్యాలయం ఇన్ఛార్జి చంద్రశేఖర్కు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈనెల 12న తన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, స్థానికంగా ఎంవీఐ కార్యాలయం అందుబాటులో ఉండడం వల్ల శ్రీసిటీ పరిశ్రమ వర్గాలకు, ఈ ప్రాంతంలోని సాధారణ ప్రజలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. శ్రీసిటీలోని సెంట్రల్ ఎక్స్ప్రెస్వే వద్ద ట్రేడ్ సెంటర్లో ఉన్న ఈ కార్యాలయంలో లెర్నర్ లైసెన్స్, శాశ్వత లైసెన్స్, వాహనాల ఫిట్నెస్ సర్టిఫికేట్ తదితర సేవలను ప్రస్తుతం అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.


ప్రథమ వర్ధంతి



స్వర్గీయ జొన్నా వెంకయ్య గారు
తలమంచి
జననం : 29-07-1948 మరణం : 28-10-2021

యతోధర్మః స్థతో కృష్ణః యతో కృష్ణః స్థతో జయః

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

భార్య
జొన్నా వసంతమ్మ

కుమారుడు - కోడలు
జొన్నా కళ్యాణచక్రవర్తి - కమల మానస

కుమార్తెలు - అల్లుళ్ళు
కిరణ్మయి - దూది హరిబాబు
జ్యోతిర్మయి - వెల్లంపల్లి విష్ణుకుమార్

మనుమలు, మనవరాళ్ళు
సాత్విక్ రామస్వామి, సాయి సంజన, నిత్యసాయి
మేఘన సాయి, అభినయ సాయి మనోజ్ఞ

వర్ధంతి : తే.17.10.2022ది సోమవారం హైదరాబాద్లోని వారి స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది. 99496 22215





జననం
09-09-1949

నిర్యాణం
07-10-2022

ఉత్తరక్రియలు

మృదుస్వభావి, స్నేహశీలి, సహృదయశాలి
మా ఇంటి పెద్ద
మాగుంట సుధాకర్రెడ్డి గారు
తే.07.10.2022ది శుక్రవారం పరమపదించారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

మాగుంట శ్రీనివాసులరెడ్డి
పార్లమెంటు సభ్యులు, ఒంగోలు
మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు : వారి పెద్దకర్మ తే.19.10.2022ది బుధవారం మ.12.30 గంటలకు హోటల్ ఐటిసి గ్రాండ్ చోళ, గిండి, అన్నాసలై, చెన్నై నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com